హైదరాబాద్ వార్త



# మద్యం దుకాణాల కేటాయింపు

- హైదరాబాద్ 82, సికింద్రాబాద్ 97 షాపులకు డ్రా
- దరఖాస్తు దారుల సమక్షంలోనే లాటరీద్వారా ఎంపిక
- జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్,అక్టోబరు 27,ప్రభాతవార్త:** జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్సుల జారీ కోసం పారదర్శకంగా డ్రా పద్ధతిన కేటాయింపులు జరిపినట్లు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. ఈమేరకు సోమవారం జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10లోగల డాక్టర్ బాబు జగ్జీవన్ రాంభవన్‌లో లాటరీ పద్దతిలో మద్యం షాపుల కేటాయింపునకు జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2025-27 రెండు సంవత్సరాలకు గాను డ్రా పద్ధతి ద్వారా హైదరాబాద్ , సికింద్రాబాద్ డివిజన్లలో నిర్వహించామని తెలిపారు. సికింద్రాబాద్ డివిజన్ లోని 3022 దరఖాస్తుల అందగా గెజిట్ సీరియల్ నంబర్ ద్వారా 97 మద్యం షాపులను కేటాయించడం జరిగిందని అన్నారు. అలాగే హైదరాబాద్ డివిజన్ లో 3201 దరఖాస్తులు అందగా 82 మద్యం షాపులను అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. ముకుంద రెడ్డి ఆధ్వర్యంలో డ్రా పద్ధతి ద్వారా కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. నూతన ఎక్సైజ్ పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని మొత్తం 179 మద్యం షాపులకు గాను 6223 దరఖాస్తులు అందగా ఒక్కో షాపు వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన వారిని ఆహ్వానిస్తూ, వారి సమక్షంలో కలెక్టర్ డ్రా పద్ధ తి ద్వారా టోకెన్స్ తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేశామని అన్నారు. డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా డ్రా చేపట్టడం జరిగిం దని




డ్రా తీస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి, చిత్రంలో ఎక్సైజ్ డిసి అనిల్‌కుమార్‌రెడ్డి, ఈఎస్ శ్రీనివాస్‌రావు తదితరులు

పేర్కొన్నారు . అదేవిదంగా డ్రా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ చేపట్టడం జరిగిందని అలాగే పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు హాజరు కావడంతో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని అన్నారు. డ్రాలో వరించి మద్యం షాపులు కేటాయించబడిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన ఏర్పాట్లు కల్పించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర అధికారుల పర్యవేక్షణలో మద్యం దుకాణాల కేటాయింపు డ్రా పద్ధతి ప్రశాంతంగా కొనసాగిందని కలెక్టర్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

### డ్రాలో గెలిచిన వారిపై ఒత్తిళ్లు..

సోమవారం నిర్వహించిన లక్కీడ్రాలో దుకాణాలు కైవసం చేసుకన్న కొత్త వారికి మద్యం మాఫియా నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. ఇదే అదునుగా భావిస్తున్న పలువురు బడావ్యాపారులు లైసెన్స్ ఫీజు, దరఖాస్తు ఫీజును చెల్లించడంతో పాటుగా గుడ్‌విల్ కింద 20 నుంచి 40లక్షల వరకు చెల్లిస్తామని చెబుతున్నారు. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో దుకాణాల్లో వాటాదారులగా కూడా చేర్చుకుంటున్నారు. ముఖ్యంగా ఏపికి చెందిన కొందరు బడా లిక్కర్ వ్యాపారులు తెలంగాణలో ముఖ్యంగా గ్రేటర్‌లో కొత్తగా దుకాణాలు దక్కించుకున్నవారి వివరాలు సేకరించి వారితో మాట్లాడుతున్నారు. ఏఇబ్బందికాకుండా తాము చూసుకుంటామని అవసరమైతే మీకువాటా ఇస్తామని హామీలు ఇస్తున్నారు. అయితే ఈవ్యవహారంపై ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించగా లైసెన్స్‌దారులు గుడ్‌విల్ కింద దుకాణాన్ని ఇతరులకు అప్పజెప్పినప్పటికీ అబ్కారీశాఖ రికార్డుల్లో పేరు మాత్రం మారదన్నారు. గుడ్‌విల్‌కింద తీసుకున్నవారు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా అక్రమాలకు పాల్పడితే దానికి పూర్తి బాధ్యత లైసెన్స్‌దారుడిదేనని పేర్కొంటున్నారు.

# ఓట్లున్న సంఘం ..జిందాబాద్.!

- -మహిళ,యువజన సంఘాలపై నేతల ఫోకస్
- -బస్తీ, కాలనీ సంక్షేమసంఘాలతో ప్రత్యేక సమావేశాలు
- -వారిని ఆకట్టుకునేందుకు వివిధ రకాల హామీలు
- -ఎన్నికలు పూర్తయ్యేవరకు తమతో ఉండాలని ఒప్పందాలు



**హైదరాబాద్, అక్టోబరు 27,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ బైపోల్‌లో అభ్యర్థుల గెలుపోటములపై వివిధ సంఘాలు ప్రభావం చూపనన్నాయి. అన్ని ప్రధాన పార్టీలు యువజన, విద్యార్థి, మహిళా సంఘాలపై దృష్టిపెట్టాయి. వారిని అకట్టుకోవడానికి రకరకాల ప్రయత్నాలు సాగిస్తున్నాయి. జూబ్లీహిల్స్‌లో కొన్నిచోట్ల హైఫై ఏరియా ఉండగా మరికొన్ని చోట్ల బస్తీల జనాభా ఎక్కువ. కాలనీల్లో సంక్షేమసంఘాలు, బస్తీల్లో మహిళా, యువజన సంఘాలు క్రియాశీలక పాత్ర పోషిస్తాయి. వీరిలోచోటా మోటా నేతలు అయా వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తుంటారు. కొన్ని సంఘాలు స్వతంత్రంగా వ్యవహరిస్తుంటాయి. అయా వర్గాలను ఆకట్టుకుని ఓట్ల పండుగ పండించుకునేందుకు రాజకీయ నాయకులు ఎత్తులు వేస్తున్నారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి నేతలు ఆయా వర్గాలపై దృష్టిసారించారు. ముఖ్యంగా ప్రతిరాజకీయ పార్టీలోనూ వారిదే కీలకపాత్ర. ప్రస్తుతం ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. అన్నిపార్టీలు సభలు ,సమావేశాలు నిర్వహిస్తున్నాయి. సాధారణంగా అక్కడ ప్రచార సభలకు, రోడ్‌షోలకు జనం విరగబడి వచ్చే పరిస్థితి తక్కువ. ఉద్యోగాలు, కూలీనాలి పనిపనులు చేసుకునే కుటుంబాలే ఎక్కువ. ఒక్కరోజు పనిలోకి వెళ్లక పోయినా కూలిపోయినట్లే. రాజకీయ నాయకుల వెంట తిరిగితే ఏం వస్తుందనే భావనతో చాలామంది దూరంగా ఉంటారు. దాదాపు పార్టీలన్నీ జనసమీకరణ చేస్తుంటాయి. ఈనేపథ్యంలో ఎక్కువ శాతం సంఘాలపై దృష్టి పెడుతుంటాయి. ఆయా సంఘాల ముఖ్యులను నేతలు ఒప్పించి సభలకు ఆహ్వానిస్తుంటారు. సభ్యులకు కూలి డబ్బు చెల్లించి ప్రచారంలో పాల్గొనేలా చేస్తుంటారు. పనిలోకి వెళ్లినా అదే కూలి వస్తుందనే ఉద్దేశ్యంతో చాలామంది మహిళలు ప్రచారానికి సై అంటున్నారు.యువజనసంఘాలదీ అదేదారి.కొన్నిసంఘాలు అభిమానం ఉన్న పార్టీలవైపు అడుగులు వేస్తున్నారు. మరి కొందరు అన్నిపార్టీల ప్రచారాల్లో పాల్గొంటున్నారు.

### స్థానిక నేతలను పిలిపించుకుని..

బస్తీల్లోని కీలక వ్యక్తుల ద్వారా పలువురు అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా పాల్గొనేలా ఆయా బస్తీల నుంచి జనాలను తరలించే బాధ్యత కూడా వారికే అప్పగిస్తున్నారు. రోజువారీగా డబ్బు, మద్యం, ఫుడ్ ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు.అలాగే బస్తీల్లోని ఓటర్లంతా తమ పార్టీకేఓటు వేసేలా ఓటుకు ఎంత ఇవ్వాలన్నదానిపై కూడా పలువురు అభ్యర్థులు స్థానికనేతలతో మంతనాలు చేస్తున్నారు. ఎవరు తమకు ఓటు వేస్తారో, ఎవరు వేయరో అన్న వివరాలను సిద్ధం చేసి అభ్యర్థులకు బస్తీ నేతలు అందజేస్తున్నారు. మొత్తానికి ఈసారి మద్యం, బిర్యానీ, డబ్బుల పంపిణీ ముమ్మరం చేసేందుకు క్యాండిడేట్లు సిద్ధమవుతున్నారు.కాలనీ సంఘాలకు బాధ్యతలు అలాగే కాలనీల ఓటర్లు, చదువుకున్న వారిని ఆకట్టుకునే బాధ్యతలు కాలనీ సంఘాలకు అప్పగిస్తున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల కాలనీ సంఘాలను అభ్యర్థులు సంప్రదిస్తున్నారు. వారిని మంచి చేసుకుని కాలనీ ఓట్లను దక్కించుకోవాలని చూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే కాలనీ సమస్యలను చెప్పాలని, వెంటనే వాటిని పరిష్కరిస్తామంటూ వారికి వర్తమానాలు పంపుతున్నారు. మొత్తానికి ఈసారి ఎన్నికల్లో గెలుపొందేందుకు కాంగ్రెస్, బిఆర్‌ఎస్ అభ్యర్థులు అవసరమైన ప్రయత్నాలు, ప్రత్యామ్నాయాలు చేసుకుంటున్నారు.

**జనం వస్తే..ఓట్లు వచ్చినట్లు కాదు**

ఒకపార్టీ అభ్యర్థి ప్రచారానికి భారీగా జనం తరలివస్తుంటారు. మరోపార్టీ అభ్యర్థి సభ వెలవెలబోతుంటుంది. జనం భారీగా వచ్చినంత మాత్రాన అందరూ ఓటేసినట్లు కాదని విశ్లేషకులు వెలవెలబోతుంటుంది. జనం భారీగా వచ్చినంత మాత్రాన అందరూ ఓట్లేసినట్లు కాదని విశ్లేషకులు చెబుతున్నారు. తమ పార్టీని గెలిపిస్తే ..ఫించన్లు వస్తాయి. .ఇళ్లు ఇస్తామని మభ్యపెట్టికొందరు జనసమీకరణ చేస్తుంటే ..మరికొందరు అభ్యర్థులు జనం తరలింపునకు భారీ ఎత్తున ఖర్చు చేస్తున్నాయి. తాము ఒకరోజు పనికి వెళితే ..ఎంత కూలి వస్తుందో..అంతిస్తే చాలాని భావిస్తున్నారు. ఆడబ్బు ఎవరు ఇచ్చినా వారి తరపున ప్రచారానికి వదిలి వెళుతున్నారు. రెండోరోజు వేరే పార్టీ వారు వస్తే ..వారి వెంట ప్రచారంలో పాల్గొంటున్నారు. యువకులు బైక్‌ర్యాలీలో పాల్గొంటే..రూ.300-500లతోపాటు పెట్రోల్ ఖర్చులు సంబంధిత అభ్యర్థి బరించేలా ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల ఎఫెక్ట్

## -వంద మంది రౌడీ షీటర్ల బైండోవర్




**హైదరాబాద్ అక్టోబరు 27, ప్రభాతవార్త** జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక మరి కొద్ది రోజుల్లో జరగనుంది. ఈ నేపథ్యంలో నగర పోలీసులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగిన నవీన్ యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ సహా మరో 100 మంది రౌడీషీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. అయితే బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 74 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు.ఇక మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న శ్రీశైలంయాదవ్ తోపాటు అతడి సోదరుడు రమేశ్ యాదవ్ సహా 19 మంది రౌడీ షీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. ఈ ఉప ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల జరుగుతున్న అసెంబ్లీ పరిధిలోని రౌడీ షీటర్లపై పోలీసులు నిఘాను పెంచారు. అయితే ఈ ఉప ఎన్నికల వేళ..వీరిపై కేసులు నమోదు అయితే మాత్రం పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు.

**బైండోవర్ అంటే..?**

సాధారణంగా ఎన్నికల సమయంలో బైండోవర్ పదం వినిపిస్తుంది. పాత నేరస్థులు, రౌడీ షీటర్లను బైండోవర్ చేస్తారు. అంటే.. ఒక వ్యక్తి వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నా.. ఆ వ్యక్తిని తహసీల్దార్ లేదా ఆర్డీవో ఎదుట పోలీసులు హాజరుపరుస్తారు. బాండ్ పేపర్‌పై ఆ వ్యక్తితో చట్ట వ్యతిరేక పనులు చర్యలు చేపట్టబోమని లిఖిత పూర్వకంగా హామీ తీసుకొని సొంతపూచి కత్తుపై విడుదల చేస్తారు.బైండోవర్‌ను బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్ అంటారు. బైండోవర్ అయిన వ్యక్తి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే 24 గంటల్లో అరెస్ట్ చేస్తారు. అతడిపై ఐపీసీ 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్ కేసులు నమోదు చేస్తారు. బైండోవర్ సమయంలో వ్యక్తులు రాసిచ్చిన పత్రాలు కొన్ని నెలల వరకు పోలీసుల వద్ద ఉంటాయి.జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నవంబర్ 11వ తేదీన జరగనుంది.ఈ ఎన్నికల్లో బీజేపీ,బీఆర్‌ఎస్,కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను బరిలో దింపాయి.ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెలువడనున్నాయి.

# విద్యుత్ హైటెన్షన్ స్థంభం ఎక్కి యువకుడు హల్‌చల్

- -సుమారు 9గంటల పాటు విద్యుత్ స్థంభంపైనే యువకుడు
- -కాపాడేందుకు విద్యుత్, పోలీస్, ఫైర్ అధికారులు విఫలయత్నం
- -చివరి నిమిషంలో జారి కిందపడి మృతిచెందిన యువకుడు



విద్యుత్ స్థంభం ఎక్కిన యువకుడు



స్థంభం పై నుంచి కిందపడడంతో చనిపోయిన యువకుడి మృతదేహం

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** నగర శివారులోని విద్యుత్ హైటెన్షన్ స్థంభం ఎక్కి ఆత్మహత్యకు పాల్పడాతనంటూ ఓ గుర్తు తెలియని యువకుడు హల్‌చల్ చేశాడు. సుమారు 9గంటల పాటు విద్యుత్ స్థంభంపైనే ఉండి అధికారులు చమటలు పట్టించాడు. తాను విద్యుత్ స్థంభం ఎక్కి ఆత్మహత్యకు యత్నించడానికి కారణం ఏంటనే విషయాన్ని తెలుసుకునేందుకు పోలీసులు ఎంత ప్రయత్నించినా ఆ యువకుడి నుంచి ఎలాంటి స్పష్టమైన కారణాలు కానీ అతని వివరాలు కానీ తెలియలేదు. చివరకు అధికారులు అతన్ని కాపాడేందుకు విద్యుత్ స్థంభం పైకి ఎక్కి అతన్ని పట్టుకునేందుకు యత్నిస్తుండగానే ఆ యువకుడు జారి కింద పడగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే లోపే ఆ యువకుడు మృతి చెందాడు. స్థానికంగా సంచలనం రేకెత్తించిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని అబ్దుల్లాపూర్‌మెట్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని విజయవాడ జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఓ విద్యుత్ హై టెన్షన్ స్థంభం పైకి సోమవారం ఉదయం 6నుంచి6.3గంటల సమయంలో ఓ గుర్తు తెలియని యువకుడు ఎక్కాడు. ఈవిషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డితో పాటు సిబ్బంది అక్కడికి చేరుకుని ఆ యువకుడిని వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలను అడుగగా అతని నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. దీంతో పాటు అతన్ని సముదాయించి కిందకి దింపే ప్రయత్నం చేసినప్పటికీ ఆ యువకుడు కిందకి దిగకపోగా మరింత పైకి ఎక్కాడు. దీంతో అప్పటికే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేయించి ఫైర్, విద్యుత్ అధికారుల సహకారంతో అతన్ని కిందకు తీసుకువచ్చేందుకు సుమారు 9గంటల పాటు ప్రయత్నించారు. చివరగా కొంతమంది సిబ్బంది స్థంభం పైకి ఎక్కి ఆ యువకుడిని పట్టుకునేందుకు యత్నించగా దగ్గరకు వెళ్లేలోపే ఆ యువకుడు మధ్యాహ్నం 3గంటల సమయంలో విద్యుత్‌స్థంభం పై నుంచి కిందకు దూకాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఆ యువకుడిని అప్పటికే సంఘటనా స్థలంలో సిద్దంగా ఉంచిన 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధా రించారు. కాగా మృతిచెందిన యువకుడికి సంబంధించిన వ్యక్తులు ఎవరూ ఇప్పటి వరకు రాలేదని, మృతుడు బీహార్ లేదా ఒరిస్సాకు చెందిన వలస కూలీ అయి ఉండోచ్చని పోలీసులు భావిస్తున్నారు.

అదే విధంగా ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు ప్రేమించిన అమ్మాయిని తనకు కాకుండా తన అన్నకు ఇచ్చి పెళ్లి చేస్తున్నారని అందుకే తాను ఆత్మహత్యకు పాల్పడేందుకు స్థంభం ఎక్కినట్లు ఉదయం అడిగిన కొంత మందితో తెలిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సిఎం పర్యటన ఖరారు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న వేం నరేందర్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు.

**జూబ్లీహిల్స్, అక్టోబరు 27, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉప ఎన్నికల ప్రచార షెడ్యూలు ఖరారు అయ్యింది. ఈ నెల 28న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరుపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూసుఫ్‌గూడలోని పోలిసు బెటాలియన్ గ్రౌండ్‌లో నిర్వహించే ఎన్నికల ర్యాలీలో పాల్గొననున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 31న వెంగళ్‌రావునగర్ డివిజన్, సోమాజీగూడడివిజన్‌లో రాత్రి 7 గంటలకు, నవంబరు 1న బోరబండలో 7 గంటలకు, ఎర్రగడ్డ డివిజన్‌లో రాత్రి 8 గంటలకు, 4న షేక్‌పేట, రహ్మత్‌నగర్, 5న షేక్‌పేట, యూసుఫ్‌గూడ డివిజన్‌లలో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 8వ తేదిన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బైక్ ర్యాలీ, 9న ఉదయం 10 గంటల నుంచి షేక్‌పేట డివిజన్‌లో బైక్ ర్యాలీలో పాల్గొంటారు. ఈ సందర్భంగా సీఎం పర్యటనను విజయవంతం చేయడానికి, ఎన్నికల్లో ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయడానికి మంత్రుల ప్రాంగణ సముదాయంలో ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసింది : హరీష్‌రావు



ఆటోలో ప్రయాణిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 27, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ ఆటో డ్రైవర్లను మోసం చేసిందని వాహనాల యజమానులకు ఇచ్చిన హామీలు ఎక్కడా నిలబెట్టుకోలేదని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ నుంచి డివిజన్ పరిధిలో ఆటో డ్రైవర్లతో, నాయకులు, కార్యకర్తలతో, స్థానిక ప్రజలతో కలిసి జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ పార్టీ భవనం వరకు ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆటోలో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి కోసం తెలం గాణ ప్రగతిని కొనసాగించేందుకు బీఆర్‌ఎస్ పార్టీనే సరియైన ఎంపిక అని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను మోసం చేసిందని బీఆర్‌ఎస్ పాలనలో లభించిన సబ్సీడీలు, బెనిఫిట్స్ అన్నీ నిలిచిపోయాయన్నారు. ఆటో డ్రైవర్ కుటుం బాలు మరోసారి ఆర్థిక కష్టాల్లోకి నెట్టబడ్డాయన్నారు. ప్రజల భారాలు పెరిగాయని పెట్రోల్ ధరలు జీవన వ్యయాలు అన్నీ పెరిగిపోయాయన్నారు. ప్రజల ఆత్మగౌరవం కాపాడేది, కష్టపడే వర్గాలకు అండగా నిలచేది ఒక్క బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు.

# ప్రైవేటు బస్సుల తనిఖీలు

## మూడు రోజుల్లో 143 ట్రావెల్స్ బస్సులు సీజ్



**హైదరాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త** ఇటీవల వేమూరి కావేరి ట్రావెల్స్ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కర్నూలులో జరిగిన ప్రమాదంతో ఆర్టీఏ అధికారులు ఎట్టకేలకు అప్రమత్తమయ్యారు.నిబంధనలకు విరుద్ధంగా నడుపుతోన్న ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. నగరంతోపాటు శివార్లలో విస్తృతంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు, వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. విజయవాడ హైవే, బెంగళూరు హైవేపై ఆర్టీఏ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. వాహనాల్లోని ఫైర్ సేఫ్టీ, మెడికల్ కిట్లను పరిశీలించారు. డ్రంకన్ డ్రైవ్, బీమా, ఫిట్‌నెస్, పర్మిట్ పత్రాలు, బస్సు లోపల భద్రతను పరిశీలిస్తున్నారు. పర్మిట్ లేకుండా వెళ్తున్న బస్సులపై, నిబంధనలు పాటించని పలు బస్సులపై కేసులు నమోదు చేశారు. అనుమతి లేకుండా నడుపుతున్న ట్రావెల్స్ బస్సులను సీజ్ చేశారు. తనిఖీలు చేస్తూ ఎక్కడిక్కడ సీజ్ చేస్తూ ఫైన్ వేస్తున్నారు. గత మూడు రోజుల్లో ఆర్టీఏ అధికారులు 143 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను సీజ్ చేశారు.సోమవారం ఒక్కరోజే 54 బస్సులను సీజ్ చేశారు.నగరం నుంచి పలు ప్రాంతాలకు వెళ్తూ రాకపోకలు సాగిస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో ఆర్టీఏ అధికారుల తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఆర్టీఏ రూల్స్‌కు విరుద్ధంగా నడుస్తున్న బస్సుల్లో తనిఖీలు చేసి సీజ్ చేస్తున్నారు. చాలా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. రోడ్ టాక్స్, ఫైర్ సేఫ్టీ, ఇన్సూరెన్స్, వెహికల్ ఫెట్నెస్, స్పీడ్ లిమిట్ సిటింగ్ కెపాసిటీ, సీటింగ్స్ పేరుతో స్లీపర్‌గా నడుపుతూ అనుమతులు లేని వస్తువులను గూడ్స్ క్యారీ చేస్తున్న బస్సులపై తనిఖీలు చేసి ఫైన్‌లు వేశారు అధికారులు. ఈనెల 25, 26, 27వ తేదీల్లో మొత్తం 143 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను సీజ్ చేసి 3.6లక్షల ఫైన్ వసూలు చేశారు.

## ప్రమాదాలను నివారించాలంటూ ఏసిపికి వినతి



గోల్కొండ ఏసీపీ ఫయాజ్ కు వినతి పత్రం అందజేస్తున్న లంగర్ హౌస్ డివిజన్ బిజెపి నాయకులు.

**మెహిదీపట్నం అక్టోబర్ 27, ప్రభాతవార్త :** లంగర్ హౌస్ డివిజన్ రాందేవ్ గూడ ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందని, రోడ్డు ప్రమాదాలను నివారించాలంటూ గోల్కొండ ఏసిపి మహమ్మద్ ఫయాజ్ కు బిజెపి లంగర్ హౌస్ డివిజన్ అధ్యక్షులు దొమ్మటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాందేవ్ గూడ ప్రధాన రహదారిలో నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురి కావడంతో పాటు మృత్యువాత చెందుతున్నారని వివరించారు. గత కొద్ది రోజుల క్రితం స్థానిక బస్తీవాసి రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొనడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని గుర్తు చేశారు. ఈ ప్రమాదాలపై గతంలో కూడా పలుమార్లు ఫిర్యాదులు చేయడం జరిగిందని తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో బిజెపి నాయకులు పూర్ణచందర్ రావు, ఉదయ్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, పాండు, అర్జున్, నాగేంద్ర ప్రకాష్ రెడ్డి, చిరంజీవి లు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించండి : కార్పొరేటర్ జితేందర్‌నాథ్

**ఆల్వాల్, అక్టోబర్ 27 (ప్రభాతవార్త):** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ డిసికి వినతి పత్రం అందించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా కాంగ్రెస్ నాయకులుతో కలిసి కార్పొరేటర్ డిసి శ్రీనివాస్ రెడ్డిని కలిసి పలు సమస్యలుపై చర్చించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలులో మౌ లిక వసతులకు సంబంధించి సమగ్ర నివేదిక డిసికి ఇచ్చామని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. జిహెచ్ఎంసి కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్ వరకు బాక్స్ డ్రైన్ ఏర్పాటు చేయాలని కోరానని తెలిపారు.

## శేరిలింగంపల్లిలో ఆకట్టుకున్న ఆర్ఎస్ఎస్ కవాతు



శేరిలింగంపల్లి పురవీధుల్లో కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 27 ప్రభాతవార్త**

రా ష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సా వాల్లో భాగంగా శేరిలింగంపల్లి నగర స్వయం సేవకులు పథ సంచలన కార్యక్రమం వైభవంగా జరిగింది. సికింద్రాబాద్ విభాక్ బౌద్దిక్ ప్రముఖ్ అచ్చవెల్లి భాను ప్రకాశ్ ఈ స్ఫూర్తిదాయక, ఉత్సా హభరిత కవాతును ప్రారంభించారు. సైనిక కవాతులాగా మనోహరంగా పదసంచన చేస్తే గుల్‌మోహర్‌పార్క్ నుంచి ప్రారంభమైన కవాతు ప్రశాంతినగర్, బాపునగర్, గోపినగర్, నెహ్రునగర్, ఆదర్శనగర్ బస్తీల్లో సాగింది. ఈ సందర్భంగా భానుప్రకాశ్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ.. హిందూ సంఘటన కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభించబడిందన్నారు. సంఘ్ స్వయం సేవకులకు క్రమశిక్షణ, దేశభక్తి వంటి ఉన్నతమైన సద్గుణాలు అలవడే విధంగా శిక్షణని స్తుందన్నారు. సంఘం అంచెలంచలుగా ఎదుగుతూ అనేక సమాజసేవా కార్యక్రమాలను చేస్తూ వస్తుందన్నారు. కన్యాకుమారి లోని స్వామి వివేకానంద స్మారక కేంద్రం, శ్రీశైలంలోని ఛత్రపతి శివాజీ స్ఫూర్తికేంద్రం, అయోధ్యలోని భవ్యమైన శ్రీరామ మందిరం సంఘ కృషివల్లనే నిర్మించబడ్డాయని అన్నారు. తిరుమల పవిత్రత ఏడు కొండలు కాకుండా రెండు కొండలకు పరిమితం చేయాలన్న ప్రతిపాదన, రామసేతు విధ్వంస ప్రతిపాతన సంఘ ఉద్యమాల వల్లనే ఆగిపోయాయన్నారు. సంఘ పనిని సమాజమంతా కలిసి వేగంగా ముందుకు తీసుకెళ్లి భారత దేశాన్ని తిరిగి విశ్వగురువు స్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ విభాగ్ సహకార్యవాహ్ నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన్ పెండింగ్ పనులకు నిధులివ్వాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి.

**నార్సింగి, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ హైదర్షాకోట్‌లోని అంబేద్కర్ భవన్ నిర్మాణపు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్ శ్రీనాథ్‌రెడ్డిలు సోమవారం కమీషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ భవన్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరామని, ఆయన వెంటనే కమీషనర్‌కు ఫోన్ చేసి రూ.50.లక్షల నిధులు మంజూరు చేయాలని ఆదేశించారని, దీంతో కమీషనర్‌ను కలిశామని వివరించారు. మా వినతిపత్రంను అందుకున్న వెంటనే సానుకూలంగా స్పందించి రూ.50.లక్షల నిధులను మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు జీవితాంతం ఋణపడి ఉంటామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ధన్నాడ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## మహంకాళీ ఆలయంలో కార్తీక దీపాల వెలుగులు



మహంకాళీ ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా దీపాలు వెలిగించిన దృశ్యం.

**బేగంపేట అక్టోబరు 27, ప్రభాతవార్త**

కార్తీక మాసం సోమవారం సందర్భంగా సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి దంపతులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈ ఓ , ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ల ఆధ్వర్యంలో పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు పూజల అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ చేసారు. ఈ సందర్భంగా మహిళలు, పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో ఆలయం మొత్తం దీపాల వెలుగులో ధగ ధగ లాడింది. అమ్మ వారి ఆలయాన్ని వివిధ రకాలైన విద్యుత్ దీపాలు, రంగు రంగుల పూలతో సుందరంగా ముస్తాబు చేసారు.

## ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి : ఎమ్మెల్యే తలసాని



మీడియాతో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, అక్టోబర్ 27 (ప్రభాతవార్త):** ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం బన్సీలాల్ పేట డివిజన్ లోని జబ్బార్ కాంప్లెక్స్ వద్ద ఆయన ఆటో నడిపి ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నేతలను హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల ను మోసం చేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్రం లో లక్షలాది మంది ఆటోలు నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు అవుతున్నా నేటి వరకు ఇవ్వలేదని అన్నారు. రెండు సంవత్సరాలకు సంబంధించి 24 వేల రూపాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వేధింపుల వలన 161 మంది ఆటో డ్రైవర్లు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు వారి ఆదాయం తగ్గి కుటుంబాలను పోషించే పరిస్థితి లేక ఇబ్బందుల్లో ఉండగా, ఇష్టానుసారంగా జరిమానాలను విధిస్తూ ఆటో డ్రైవర్లను ప్రభుత్వం వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బి ఆర్ ఎస్ పార్టీ ఆటో డ్రైవర్ల కు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, పద్మారావు నగర్ బిఆర్ఎస్ ఇంచార్జ్ గుర్రం పవన్ కుమార్ గౌడ్, బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ప్రేమ్, లక్ష్మీపతి, సురేష్, కుమార్ యాదవ్, అబ్బాస్, ఆటో యూనియన్ అధ్యక్షుడు విజయ్, సాయి తదితరులు ఉన్నారు.

# కబ్జాలపై జనం కన్నెర్ర

తమ ప్రాంతాల్లో ఆక్రమణలు జరిగితే వెంటనే హైడ్రాకు ఫిర్యాదు

ఫోటోలు, వీడియోల రూపంలో ఉన్నతాధికారులకు చేరవేత



ప్రజావాణి ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాద్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**

కబ్జాలు జరగుతుంటే నగర ప్రజలు చూస్తూ ఊరుకోవడం లేదు. నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. రహదారి బంద్ అయితే ఫోటోలు తీసి మరీ చూపిస్తున్నారు. చెరువుల్లో ఆక్రమణలు జరుగుతుంటే వీడియోలు తీసి పెడుతున్నారు. దశాబ్దాల నాటి సమస్యలకు గంటల్లో, రోజుల్లో పరిష్కారం చూపుతున్నారంటూ హైడ్రాకు కితాబిస్తున్నారు. ఇలా హైడ్రా ప్రజావాణికి సోమవారం 52 పిర్యాదులు అందాయి. శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ గ్రామం పరిధిలోని సరసింహకుంట తూములు మూసేసి.. అలుగు ఎత్తు పెంచడం వల్ల ఎఫ్‌టీఎల్ కంటే ఎక్కువ నీరు నిలిచి తమ పంట పొలాలు మునిగిపోయాయని ఆ గ్రామ ప్రజలు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వాస్తవంగా చెరువు ఎంత విస్తీర్ణంలో ఉందో అంతే నీరు నిండేలా చూసి తమ పొలాలను రక్షించాలని కోరారు. చెరువు స్థాయికి మించి నిండడంతో ఆ నీరు ఔటర్ రింగు రోడ్డు ఎగ్జిట్ 15 వద్ద సర్వీసు రోడ్డును ముంచెత్తుతోందని.. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ, మండలంలోని బీరంగూడలో ఉన్న శాంబుని కుంట కబ్జాలకు గురి అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 756లో ఉన్న ఈ చెరువు వాస్తవ విస్తీర్ణం 22.11 ఎకరాలు కాగా.. ప్రస్తుతం ఆరేడు ఎకరాలకు పరిమితమైందని వాపోయారు. చెరువులో మట్టిపోసి ఆక్రమణలకు పాల్పడుతున్నారని హైడ్రా చర్యలు తీసుకోకపోతే ఆ చెరువు కనుమరుగౌతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాగర్‌రోడ్డులో ఉన్న యశోదనగర్ కాలనీలో శివారు ఇంటి స్థలాల వారు రోడ్డును కలిపేసుకుని దారి లేకుండా చేస్తున్నారని యశోదనగర్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. మరో రోడ్డును ఆక్రమించేసి 107 గజాల ప్లాట్ స్థలంగా చూపిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో లే ఔట్‌లోని రహదారులు దాటాలంటేనే కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. కూకట్‌పల్లి ప్రాంతంలో పరికి చెరువులో సుమారు 12 ఎకరాల మేర రాత్రికి రాత్రి మట్టిపోసి నింపుతున్నారని.. నంబరు ప్లేటు లేని వాహనాలను వినియోగిస్తున్నారని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. 18 అంతస్తుల అపార్టుమెంట్ ను నిర్మించి అమ్మేసేందుకు సిద్ధం అవుతున్నారని.. వెంటనే హైడ్రా ఆపాలని కోరారు. లేని పక్షంలో అందులో ప్లాట్లు కొన్న వారు మోసపోయే ప్రమాదం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అమీన్‌పూర్ పెద్ద చెరువులోకూడా మట్టిపోసి.. భవన నిర్మాణాలు చేపడుతున్నారని.. అడ్డుకున్న తమపై దాడి చేయడమే కాకుండా.. స్థానిక పోలీసు స్టేషన్లో కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని బాలానగర్ మండలం, హస్మత్‌పేట్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసులు హైడ్రా ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 1లోని 28.28 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక రాజకీయ నాయకులు ఆక్రమించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజాం కాలం నాటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ భూమిని 1953లో పురావస్తు శాఖ గజిట్ బుక్‌లో కూడా యాడ్ చేసింది. కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన స్థానిక నాయకులతో పాటు వారి అనుచరులు ఈ భూమిని రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మలచి చిన్నచిన్న ప్లాట్లుగా అమ్మేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## అనుమతులు లేకుండా అక్రమ షెడ్ల నిర్మాణం

-నోటీసులతో సరిపెడుతున్న ఐలా అధికారులు

-ఫిర్యాదు చేస్తే నోటీసులతో కాలయాపన

-అధికారులు తీరుపై సర్వత్రా విమర్శలు



చర్యలు తీసుకోకుండా ఐలా అధికారుల కాలయాపన

**అత్తాపూర్ అక్టోబరు27, ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఐలా పరిధిలో జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్న క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాల్సి న ఐలా అధికారులు తమకు ఏమి పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో అక్రమ నిర్మాణదారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా యథేచ్చగా నిర్మాణాలు సాగిస్తున్నారు. దింతో భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పండుతుంది. అయినప్పుటికి ఐలా అధికారులు నోటీసులు ఇవ్వడం వరకే పరమితం కావడంపై అధికారుల తీరుపై స్థానికులను నుండి సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

**నోటిసులతో సరిపేడుతున్న ఐలా అధికారులు :** కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఐలా పరిధిలో నిర్మాణదారులు అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న అక్రమ షెడ్లపై పలువురు స్థానికులు ఐలా అధికారులకు ఫిర్యాదు చేస్తే నామమంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో అక్రమ నిర్మాణదారులు అధికారుల నోటీసులను బేఖాతరు చేస్తూ నిర్మాణాలు సాగిస్తూ పనులు పూర్తి చేసుకుంటున్నారు. ఐలాలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఓ యజమాని నిర్మాణం సాగిస్తున్నాడు. సదరు యాజమానిపై పలువురు ఫిర్యాదు చేస్తే అధికారులు నోటీసులు ఇచ్చారు. నోటీసులను లేక చేయకుండా రెండు నెలలుగా యజమాని అక్రమ నిర్మాణ పనులు జోరుగా సాగిస్తున్న చర్యలు తీసుకోవాల్సి న ఐలా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నోటీసులతో కాలయాపన చేస్తూ సదరు నిర్మాణదారులకు అంతర్గతంగా సహకారం అందిస్తున్నారని స్థానికులు నుండి తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై ఐలా అధికారులను సంప్రదించగా నోటీసులు ఇవ్వడం జరిగిందని ఎలాంటి పనులు జరగకుండా చర్యలు తీసుకుంటామని త్వరలోనే అక్రమ షెడ్లను కూల్చివేస్తామని పేర్కొన్నారు.

## మతపరమైన విద్వేషాలను విధ్వంసం చేసే యూట్యూబ్ ఛానళ్లపై చర్యలు తీసుకోవాలి



రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని వినతి పత్రాన్ని సమర్పిస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్

**చిక్కడపల్లి అక్టోబర్ 27 (ప్రభాతవార్త):** మతపరమైన విద్వేషాలను విధ్వంసం చేసే యూట్యూబ్ చానర్ల నియంత్రణపై జోక్యం చేసుకోవాలని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ శివధర్ రెడ్డికి విజ్ఞప్తి చేసారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర డీజీపీని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ డిజిపిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. యూట్యూబ్ ఛానెల్స్, మీడియా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా మతపరమైన విభేదాలు అప్పుడప్పుడు మతపరమైన ఉద్రిక్తతలను రేకెత్తించే, శాంతికి ముప్పు కలిగించే మరియు వివిధ వర్గాల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసే చర్చలను ప్రసారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. క్రైస్తవ మైనారిటీలపై దౌర్జన్యాలు మతపరమైన నిర్మాణాలను ధ్వంసం చేయడాన్ని అరికట్టాలని, హైదరాబాద్ పరిధిలోని ప్రార్థనా స్థలాలలో ట్రాఫిక్ పార్కింగ్ చలాన్లు. రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్‌ల పరిధిలో భక్తులు ఆర్థిక భారం లేకుండా తమ విశ్వాసాన్ని ఆచరించడానికి వీలుగా వాతావరణాన్ని కల్పించాలని, డిసెంబర్ 2025 లో రాష్ట్రంలోని వివిధ ప్రదేశాలలో గృహ సందర్శన కరోల్స్, వీధి కరోల్స్, కార్నివాల్స్, క్రిస్మస్ సీజన్ కార్యక్రమాలను నిర్వహించడానికి అనుమతులు ఇవ్వడంతో పాటు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యనిర్వాహక సభ్యులు రెవరెండ్ పి. జయప్రకాష్, రెవరెండ్ కె. డేనియల్, రెవరెండ్ టి. సోలమన్ రాజ్, కె. అహీనోమ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి భాష్యం చెప్పిన యాగం నాటకం : డా. కె.వి.రమణాచారి

**రవీంద్రభారతి, అక్టోబరు 27 ప్రభాతవార్త :**



ప్రజాస్వామ్యానికి భాష్యం చెబుతూ ప్రతీ రాజకీయ నాయకుడికి ఉండవలసిన ముఖ్యలక్షణం నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితమై జీవించడమేనని చెప్పే సందేశాత్మక నాటకమే యాగం అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి తెలిపారు. డబ్బు సంపాదనలోపడి ప్రజలను మర్చిపోయి యాగాలను, సర్వేలను నమ్ముకుంటే ఆఖరికి పరాజితుడిగా మిగులుతాడని, ప్రజలకు దగ్గరైతేనే నాయకుడుగా భవిష్యత్తు ఉంటుందని ఈ నాటకం స్పష్టం చేసిందన్నారు. రసరంజని హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కళాంజలి, హైదరాబాద్ వారి సమర్పణలో శ్రీశైలమూర్తి రచన, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో యాగం నాటకం అద్భుతంగా ప్రదర్శింపబడింది. ముఖ్య పాత్రల్లో మోహినిగా డా. శ్రీజ సాదినేని, యుగంధర్‌గా శశిధర్ పరశురాంగా సుబ్బారావు, ప్రాణమిత్రగా అవినాష్, నేకేడ్‌రాజుగా తిరుమల, స్వామిగా కొల్లా రాధాకృష్ణలు నటించగా, సురభి నాగరాజు సందర్భానుసారంగా చక్కని సంగీతం సమకూర్చారు.

## హైడ్రా కాపాడిన స్థలానికి ఫెన్సింగ్ వేయాలని కమిషనర్‌కు వినతి



మణికొండ తిరుమలహిల్స్ కాలనీలో హైడ్రా సంరక్షించిన 1054.చదరపు గజాల స్థలానికి ఫెన్సింగ్ వేయాలని కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ ప్రతినిధుల బృందం

**నార్సింగి, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్ కాలనీలో హైడ్రా సంరక్షించిన రూ.90.కోట్ల విలువైన 1054.చదరపు గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని కోరుతూ ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ అధ్యక్షులు అర్వపల్లి వంశీ బృందం హైడ్రా కమీషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ అత్యంత ఖరీదైన స్థలంను హైడ్రా అధికారులు నిజాయితీతో వ్యవహరించి కాపాడారని వివరించారు. ఆ స్థలం మళ్లీ కబ్జాపాలు కాకుండా ఉండాలంటే దాని చుట్టూ ఫెన్సింగ్ వేసి, స్థానికుల ప్రయోజనార్థం వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట స్థలం, ఓపెన్ జిమ్, పార్కు సౌకర్యాలు కల్పించేందుకు హైడ్రా కమీషనర్ రంగనాథ్‌ను కోరామని వివరించారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంలో హైడ్రా అధికారులు చేస్తున్న కృషి అమోఘమని పేర్కొన్నారు. హైడ్రా ఏర్పడిన తరువాత వందల కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను కబ్జా చెర నుంచి విడిపించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకు రావడం చాలా సంతోషంను కలిగిస్తుందన్నారు. చారిత్రక చెరువులు, నాలాలను కాపాడడం వలన వరద నీరు సులువుగా దిగువ ప్రాంతాలకు చేరి ముంపు సమస్య భారీగా తగ్గిపోయిందన్నారు. వరద ముప్పు తగ్గడంతో బాధి ప్రజలంతా హైడ్రా అధికారుల తీరును మెచ్చుకొంటున్నారని తెలిపారు. మా వినతిపత్రం అందుకున్న వెంటనే హైడ్రా కమీషనర్ రంగనాథ్ స్పందిస్తూ వెంటనే ఫెన్సింగ్ వేసే పనులు చేపట్టాలని, మరిన్ని ఆక్రమణలను నివారించేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఆ స్థలంను తాను స్వయంగా సందర్శిస్తానని హామీనిచ్చారని వంశీ వివరించారు. అనంతరం హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌ను సత్కరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తిరుమలహిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.అవినాష్, ఉపాధ్యక్షుడు భరత్ కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావ్, గౌరవ సభ్యులు రంగాచారి తదితరులు ఉన్నారు.

## పెన్షనర్ల నాలుగు డిమాండ్లను పరిష్కరించాలి : చంద్రశేఖర్



ప్రసంగిస్తున్న తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సెక్రటరీ జనరల్ సి. చంద్రశేఖర్

**చిక్కడపల్లి అక్టోబర్ 27 (ప్రభాతవార్త):** తెలంగాణ పెన్షనర్లకు సంబంధించిన ప్రధానమైన నాలుగు డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించక పోతే నవంబర్ 7న ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష నిర్వ హిస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటకండ్ల దామోదర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ సి. చంద్రశేఖర్‌లు తెలిపారు. సోమవారం పెన్షనర్ల రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో రెండు లక్షల 60 వేల మంది తో కూడిన తమ సంఘం డిమాండ్లపై సీఎం రేవంత్ రెడ్డికి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు పలు సార్లు స్వయంగా కలిసి విన్నవించినప్పటికీ హామి ఇచ్చి ఇంత వరకు అమలు చేయక పోవడం శోచనీయమనరారు. కేవలం రూ.390 కోట్లు ఉద్యోగులకు కేటాయించినట్లు జూన్ 5న నిర్వహించిన కేబినెట్ మీటింగ్ లో ప్రభుత్వం చెప్పిందని, ఇవి పెన్షనర్లకు ఏమాత్రం సరిపోవన్నారు. పెన్షనర్లకు నెలకు వెయ్యి కోట్లు అయినా కేటాయించాలని వారు తెలిపారు. లేని పక్షంలో 10 వేల మంది పెన్షనర్లతో నవంబర్ 7న ఇందిరాపార్క్ లో నిరసన దీక్ష చేపడుతామన్నారు. పెన్షనర్ల నిరసన దీక్ష ఆందోళన వరకు ప్రభుత్వం వెళ్లనీయకుండా ఆ లోగా తమ డిమాండ్లను అమలు చేయాలని దామోదర్ రెడ్డి, చంద్ర శేఖర్‌లు కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పి. శ్యామ్ రావు, లక్ష్మీ నరసింహా రావు, గంగారెడ్డి, శంకర్ రెడ్డి, ఈశ్వరయ్య, ప్రహ్లాద రావు, హైదరాబాద్ ప్రసిడెంట్ టీ. ఇందర్ సింగ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఏ గోపాల్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎస్. జగదీశ్వర్, మేడ్చల్ ప్రసిడెంట్ వీ. వెంకట్ రామ్ రెడ్డి, నల్గొండ ప్రసిడెంట్ జి. వెంకట్ రెడ్డి, సంగారెడ్డి జనరల్ సెక్రటరీ బీ. మురళీ ధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగం లక్ష్యంగా చదవొద్దు

- మాజీ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ




కార్యక్రమంలో మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ, చిత్రంలో జేడీ లక్ష్మీనారాయణ, బాలలత తదితరులున్నారు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 27, ప్రభాతవార్త:**

మన విద్యావ్యవస్థలో పునాదులు మరింత బలోపేతంగా ఉండాల్సి న అవరం ఉందని లోక్‌సత్తా వ్యవస్థాపకులు, మాజీ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. లాయిడ్ గ్రూప్స్ ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆన మాట్లాడుతూ ర్యాంకులు ప్రధానం కాదని, కాన్సెప్ట్ అప్లికేషన్, ఆలోచనస్వతంత్రం ముఖ్యమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం లక్ష్యంగా చాలా మంది విద్యార్థులు తమ జీవిత గమ్యాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. సమాజంలో విస్తృతమైన అవకాశాలున్నాయని, వాటిపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్య మన భయాన్ని తొలగించేలా ఉండాలని, కాని అది భయాన్ని కల్పించి ఆత్మహత్యలకు కారణమవుతుందన్నారు. విద్య మన కాళ్ల మీద మనల్ని నిలబడేలా చేస్తుందన్నారు. సివిల్స్ అకాడమీ ఛైర్మన్ బాలలత మాట్లాడుతూ కాన్సెప్ట్, టెక్నాలజీ ఆధారిత విద్య ఎంతో అవసరమన్నారు. లాయిడ్స్ గ్రూపు సంస్థ సీఎండి విక్రమ్ నారాయణ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఇది ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విక్రమ్ అజయ్‌బాబు, విక్రమ్ సురేంద్ర, భీముని తిరుపతిరెడ్డి, కందిమళ్ల సాంబశివ రావు, ఆళ్ల గిరిబాబు, విజయ్‌భాస్కర్, మురళీ, పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా, వైద్య, భారీ పరిశ్రమ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సోషలిస్ట కూటమి నేతలు

**ముషీరాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** ప్రైవేట్ హాస్పటల్స్, విద్యా, వైద్య, భారీ పరిశ్రమ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని సోషలిస్ట్ కూటమి జాతీయ కార్యదర్శి ఎల్.జైబాబు డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్ చట్టంకై దేశ వ్యాప్త ఉద్యమం చేపడదామని పిలుపునిస్తూ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ప్రభుత్వ రంగం తగ్గిపోయి, ప్రైవట్ రంగం పెరిగిపోతున్న నేటి కాలంలో ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలుచేయాల్సి అవసరం ఉందన్నారు. సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ ఇచ్చిన మాట ఏమయిందని ప్రశ్నించారు. ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న కోటీ 36 లక్షల మందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో తొలగించిన ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణలో ప్రైవేట్ రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సినీపరిశ్రమ ట్రేడ్ యూనియన్ కార్యదర్శి ఎన్.రాజు, డాక్టర్ శ్రీను, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ప్రొఫెసర్, జాతీయ పొలిటికల్ జేఏసీ నేత వి.జి. ఆర్.నారగోణి, జైహింద్ పార్టీ జాతీయ అధ్యక్షులు దశరథరాంరెడ్డి, ఫజల్ ఖాన్, విజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్‌పై కత్తులతో దాడి

**బేగంపేట అక్టోబరు 27, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ మహంకాళీ పోలీసు స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి సమయంలో ఆటో డ్రైవర్ పై కత్తిపోట్లు కల కలం సృష్టించాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం నిందితులు ఆటో తో పాటు సెల్‌ఫోన్ ను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై మహంకాళీ పోలీసుస్టేషన్ లో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి ఖైరతాబాద్ ఎక్స్ రోడ్డులో టీజీ 11టి 1715నెంబరు కల్గిన ఆటోను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఖైరతాబాద్ ఎక్స్‌రోడ్డు నుంచి రాణిగంజ్ వెళ్లాలంటూ డ్రైవర్ ఘాన్సీరామ్‌ను అడిగారు. అంగీకరించిన ఆటో డ్రైవర్ వారిద్దరినీ ఆటోలో ఎక్కించుకున్నాడు. వారిని రాణిగంజ్ చౌరస్తాకు తీసుకుని వెళ్తున్న క్రమంలో ఆటో బాంబే హోటల్ సమీపంలోకి రాగానే ఆటోలోని గుర్తు తెలియని వ్యక్తులు డ్రైవర్ ఘాన్సీరామ్‌పై కత్తితో దాడిచేసారు. ఈ ఘటనలో అతనికి పక్కటెముకలలో గాయాలయ్యాయి. వెంటనే అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు ఆటోను తీసుకుని వారు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### జిహెచ్ఎంసి నైట్ షెల్టర్‌లో వ్యక్తి మృతి

**బేగంపేట అక్టోబరు 27, ప్రభాతవార్త :** బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ లో ఉన్న జీహెచ్ఎంసీ నైట్ షెల్టర్ లో ఉంటున్న ఓ వ్యక్తి అనా రోగ్య కారణాలతో మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీసుస్టే షన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలి లా ఉన్నాయి. బేగంపేట బాలంరాయికి చెందిన బి.శ్రీనివాస్(45) ఇంట్లో విబేధాల కారణంగా కొంతకాలం నుంచి ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ బ్రిడ్జి కింద ఉన్న జీహెచ్ఎంసీ నైట్ షెల్టర్ లో ఉంటున్నాడు. పగటి సమయంలో రోజువారీ పనులకు వెళ్లి రాత్రికి నైట్ షెల్టర్ లో నిద్రిస్తున్నాడు. ఈ నెల 25న సాయంత్రం గం 4.40లకు ఆయన ఆరోగ్యం ఏమీ బాగోలేక పోవడంతో పాటు సోదరుడు రాఘవేందర్ కు అక్కడి నైట్ షెల్టర్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. దీంతో రాఘవేందర్ అక్కడికి చేరుకోగా అప్పటికే అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి వెళ్తున్న మార్గమధ్యంలోనే శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా మృతుడికి భార్య ప్రియదర్శిని ,కుమారుడు వరుణ్ ఉన్నారు. మృతి వార్తను పోలీసులు వారికి తెలియజేసే ప్రయత్నం చేసినప్పటికీ వారి నుంచి స్పందన లేదు. సోదరుడు రాఘవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### భవనం టెర్రస్ పై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య....

**బేగంపేట అక్టోబరు 27, ప్రభాతవార్త**

భవనం టెర్రస్ పై నుంచి దూకి ఎం ఎస్ జనరల్ సర్జన్ కోర్సు చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట ప్రకాష్ నగర్ మహావీర్ ఫామ్ గ్రోవ్ అపార్ట్‌మెంట్‌లో నివసించే ఆర్.అనూప్ కుమార్ ఎలక్ట్రిసిటీ విభాగంలో ఏ డీ ఈ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిలో అభిరామ్ (26)సనత్‌నగర్ లోని ఈ ఎస్ ఐ హాస్పిటల్ లో ఎంఎస్ జనరల్ సర్జన్ కోర్సు చదువుతుండగా కుమార్తె అంజలి బీటెక్ మూడవ సంవత్సరం చదువుతుంది. అయితే అభిరామ్ ఈ నెల 25న ఉదయం గం 7లకు హాస్పిటల్ కు వెళ్లి మరుసటి రోజు ఉదయం గం 6.45నిలకు ఆటోలో ఇంటికి వచ్చాడు. ఇంటికి రావడంతోనే లిఫ్ట్‌లో నాలుగవ అంతస్తుకు వెళ్లి తన బ్యాగ్‌ను కింద పడేసి టెర్రస్‌పైకి ఎక్కి అక్కడి నుంచి కిందికి దూకాడు. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డ అభిరామ్ అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. అభిరామ్ ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. తండ్రి అనూప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రైమరీ పాఠశాల అభివృద్ధి కోసం కృషి : కార్పొరేటర్



మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో ప్రహరీ గోడ నిర్మాణం కోసం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలిస్తున్న దృశ్యం

**మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబరు 27 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో అభివృద్ధి పనులలో భాగంగా ప్రహరీ గోడ నిర్మాణ కోసం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సోమవారం జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు త్రాగు నీరు, మరుగు దొడ్లు, ఇతర వసతులను అధికారులతో కలిసి పరిశీలించామని తెలిపారు. వీలైనంత త్వరగా స్పెషల్ ఫండ్ విడుదల చేయించి పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యే విధంగా కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జవహర్‌లాల్, ఉపాధ్యాయులు, మన్మోహన్ రెడ్డి, శ్రీ కాంత్ రెడ్డి, చిన్న సోమ గణేష్, శంకర్ రెడ్డి, జిహెచ్ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించుకోవాలి

### టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా

**ముషీరాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటులు నందమూరి బాలకృష్ణపై ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తక్షణమే ఉపసంహరించుకోవాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో సినీ ప్రముఖుల పట్ల చులకన భావంతో ప్రవర్తించిన తీరును బాలకృష్ణ ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావిస్తే, తన వ్యవహారశైలి బయటపడేశారనే ఉక్రోషంతో బాలయ్య బాబు పై తాగుబోతు అంటూ నోటికి వచ్చినట్లు విమర్శలు చేయటం జగన్‌మోహన్‌రెడ్డి నీచప్రవృత్తికి నిదర్శనమన్నారు. మూడు పర్యాయాలు హిందూపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయిన బాలయ్య దశాబ్దాలుగా బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ ద్వారా పేదలకు సేవలు అందిస్తూ, మచ్చలేని నాయకుడిగా, ఎవరి అండదండలు చూసుకోకుండా, తనకు తానుగా ఎదుగుతూ, అటు రాజకీయ రంగంలో అవినీతి రహితుడిగా, మచ్చలేని నాయకుడిగా, ఇటు చలన చిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుని, అభిమానుల మన్ననలతో రాణిస్తూ కేంద్ర ప్రభుత్వంచే పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించబడిన వ్యక్తిపై విమర్శలు చేయటం ఆకాశంపై ఉమ్మి వేయటం లాంటిదని అన్నారు. ఇప్పటికైనా బాలకృష్ణపై చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి : ఆకుల సతీష్



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్

**నిజాంపేట్, అక్టోబర్ 27, ప్రభాతవార్త**

ప్రభుత్వ భూములు, చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో ఆకుల సతీష్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సర్వేనెంబర్ 274 చూపిస్తూ సర్వేనెంబర్ 233/15 ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని అక్రమ విల్లాల అనుమతులు నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో అక్రమ నిర్మాణాలపై అనేకసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్నవారే లేరన్నారు. సర్వే నెంబరు 141 బాచుపల్లిలో అనుమతి తీసుకొని, సర్వేనెంబర్ 142 యుఎల్‌సి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని చేపడుతున్న అక్రమ నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గతంలో పలుసార్లు అధికారులను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మూడు నెలలు గడుస్తున్న సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, చందు, ఈశ్వర్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సనత్ నగర్‌లోని అల్లా ఉద్దీన్ కోటీలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచన మేరకు ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే తలసాని హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలలో నిర్వహించే వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బస్తీలోని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా చొరవ తీసుకోవాలని బస్తీ నాయకులకు ఆయన సూచించారు. శిబిరానికి వచ్చిన వైద్యులు, సిబ్బందిని కొలను బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అల్లా ఉద్దీన్ కోటీ బస్తీ వాసులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఖలీల్, శేఖర్, పురుషోత్తం, సురేంద్ర, బస్తీ నాయకులు కరీంలాలా, ఫాజిల్, వైద్యులు శిరీష, లలిత్, షమీరా పాల్గొన్నారు.

## బాధితులను ఆదుకోవటమే విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ లక్ష్యం

### విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ కన్వీనర్ గిరి ప్రసాద్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ కన్వీనర్ గిరి ప్రసాద్ శర్మ

**ముషీరాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** ఏ సంస్థను నమ్మి, ఎవరు మోసపోయినా, నష్టపోయినా, బాధితులకు అండగా విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ ఉంటుందని, బాధితులను ఆదుకోవటమే మా ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని విక్టిమ్స్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ కన్వీనర్ గిరి ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ కమలాకర్‌ను నాంపల్లి కోర్టు దోషిగా తేల్చిందని, అయినప్పటికీ ఇంకా ఇన్వెస్టర్లను మోసం చేసే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల మంది నుంచి పెట్టుబడులు తీసుకుని, వేల కుటుంబాలను రోడ్డుపాలు చేయటమే కాకుండా, ఇన్వెస్టర్లు పెట్టిన పెట్టుబడులను తగ్గించి, అబద్ధపు స్టేట్‌మెంట్లు సీసీఎస్‌కు డిఎఫ్ఐ కమలాకర్ సమర్పించాడని ఆరోపించారు. ఇటువంటి మోసపూరిత చర్యలను కమలాకర్ తక్షణమే మానుకోవాలని, తక్షణమే ఇన్వెస్టర్ వారీగా స్టేట్‌మెంట్లు సమర్పించి, బకాయిలు చెల్లించాలని, లేనిపక్షం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీసీఎస్‌లో వినతి పత్రం సమర్పించటం కూడా జరిగిందని తెలిపారు. ధన్వంతరి ఫౌండేషన్ ఇన్వెస్టర్లకు న్యాయం జరిగేవరకు వదిలేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బాధితులు శ్రీనివాస్‌సాయి, రాఘవశర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలి : నర్మధ

**కంటోన్మెంట్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:**

ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని భగవంతున్ని వేడుకున్నట్లు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ తెలిపారు. కార్తీక మాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని 6వ వారునభావన కాలనీలోని గణేష్ కాలనీలో శివపార్వతులను ఆమె దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బానుక మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఆద మరిచారో అంతే సంగతి...

-వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలు

-కట్టమైసమ్మ ఆలయం జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు

-అధికారులు చర్యలు చేపట్టాలంటున్న స్థానికులు,వాహనదారులు



కట్టమైసమ్మ అమ్మ వారి ఆలయం జంక్షన్‌లో గజిబిజీగా ప్రయాణిస్తున్న వాహనాలు.

**బేగంపేట అక్టోబరు 27,ప్రభాతవార్త**

నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే మార్గంలో ఆ జంక్షన్ ప్రమాదాలకు కేరాఫ్ గా మారింది.తరచూ అక్కడ ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు.పంజాగుట్ట నుంచి వచ్చే వాహనాలు బేగంపేట ఫ్లై ఓవర్ దిగిన వెంటనే ఎడమవైపు ఫతేనగర్,బల్కంపేట,బాలానగర్ తదితర ప్రాంతాలకు వెళుతుంటారు.అలాగే ఫతేనగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఇదే ప్రాంతంలో ఫతేనగర్ బ్రిడ్జిని దిగి బేగంపేట సికింద్రాబాద్ ప్రధాన రోడ్డుపైకి చేరుకుంటాయి.అలాగే పంజాగుట్ట,అమీర్‌పేటల వైపు నుంచి బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ,బ్రాహ్మణవాడీ,మాతాజీ నగర్ లకు శ్రీకట్టమైసమ్మ అమ్మ వారి ఆలయం ముందు నుంచి ఎడమ వైపుకు దిగి ప్రయాణిస్తుంటాయి.ఇక్కడే మూడు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు కలిసే కూడలి కావడం బేగంపేట ఫ్లై ఓవర్ నుంచి వేగంగా వస్తున్న వాహనాలు ఒక్క సారిగా ఎడమవైపుకు మళ్లడం,బేగంపేట బస్తీ లో నుంచి వచ్చే వాహనాలు ఒక వైపు మరో వైపు ఫతేనగర్, బల్కంపేట ల నుంచి వచ్చే వాహనాలు వల్ల ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఫతేనగర్ నుంచి బేగంపేట కు వస్తున్న ద్విచక్ర వాహన దారుడుని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి ఆగకుండా వెళ్లి పోయింది.ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.ఈ జంక్షన్ పగలు,రాత్రి తేడా లేకుండా ఎంతో రద్దీగా ఉంటుంది.అయినా ఈ ప్రాంతంలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడాన్ని స్థానికులు,వాహనదారులు ఆక్షేపిస్తున్నారు.ప్రతి నిత్యం ఉదయం ,సాయంత్రం ఈ ప్రాంతానికి పెద్ద సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి.ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ,బ్రాహ్మణవాడీ,మాతాజీనగర్ బస్తీల నుంచి నిత్యం ప్రజలు అటు అమీర్‌పేట, ఇటు ఫతేనగర్ లకు వాహనాలపై ప్రయాణిస్తుంటారు. ఇలాంటి జంక్షన్ లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంపై బస్తీ వాసులు,వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటి కైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు శ్రీకట్టమైసమ్మ ఆలయం వద్ద ఉన్న జంక్షన్ లో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

## ప్రాణ రక్షణకు రక్తదానం చేయాలి : డిసిపి రష్మిపెరుమాల్



మారేడ్‌పల్లిలో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిసిపి సాధన రష్మి పెరుమాల్

**కంటోన్మెంట్,అక్టోబర్ 27 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షత గాత్రుల ప్రాణాలను రక్షించేందుకు రక్తం ఎంతో అవసరమని, రక్తం లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అందు వల్ల రక్తదానం చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఉత్తర మండలం డిసిపి సాధన రష్మి పెరుమాల్ పిలుపునిచ్చారు. పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తర మండలం డిసిపి ఆధ్వర్యంలో సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని పద్మశాలి కళ్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంటనల్, సికింద్రాబాద్ నార్త్ జోన్ పోలీస్,కంటోన్మెంట్ బోర్డు, సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఉత్తర మండలం పోలీస్ స్టేషన్ పరిధిలోని మారేడ్‌పల్లి, తుకారాంగేట్, బోయిన్‌పల్లి, గోపాలపురం, కార్ఖాన మార్కెట్, తిరుమలగిరి, బొల్లారం, బేగంపేట్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ప్రజలు, పోలీసులు, యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దాదాపు 500 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు గోపాల క్రిష్ణ, రమేశ్, సుబ్బయ్య, శంకర్ రాజ్‌లతో ఆయా పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు చేతన్ గుడిమల,కార్యదర్శి, పరాస్ దోషి, కోశాధికారి బాను ప్రసాద్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్, అడ్వకేట్ దేవకర్, అనీల్, నాయకులు కాశిరెడ్డి, వీర వర్ధన్, రావుల సతీష్,హరి తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్ ముఖ్య నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 27 ప్రభాతవార్త:** కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీలో మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. సోమవారం మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అర్.డి. నాగేశ్ యాదవ్,చిరబోయిన సంతోష్ యాదవ్, పి. నర్సింగ్ రావ్, డి.బాబురావ్, రేపాల వెంకటేశ్వర్లు, శివ, శేఖర్ ముదిరాజ్, నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు.

## స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలి : ఎబివిపి



స్కాలర్ షిప్‌ల కోసం మారేడ్‌పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న ఏబివిపి విద్యార్థులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 27 ప్రభాతవార్త:** రాష్ట్రం ప్రభుత్వం అధికారం చేపట్టి 2 సంవత్సరాలు పూర్తి కా వస్తున్నా విద్యార్థుల స్కాలర్ షిప్‌లు చెల్లించడం లేదని, స్కాలర్ షిప్‌లు ప్రభుత్వ బిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని ఏబివిపి సికింద్రాబాద్ జిల్లా నాయకులు బాలు, పాండు రంగన్‌లు తెలిపారు. విద్యార్థుల స్కాలర్ షిప్‌లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడికల్,డిగ్రీ, పాలిటెక్నిక్ వంటి వివిధ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి మండల కార్యదర్శి క్రిష్ణ, నాయకులు వెంకట్,రామ్,శ్రీరామ్,రుషి, వినోద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయటానికి యువత ముందుకురావాలి



రక్త దానం చేసిన కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్‌కు సర్టిఫికెట్‌ను ప్రధానంచేస్తున్న బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఎస్ఐ అంబేద్కర్

**చార్మినార్,అక్టోబరు 27 ప్రభాతవార్త :**

సమాజంలోని యువత రక్తదానం చేయటానికి ముందుకు రావాలని బహదూర్‌పుర నియోజకవర్గం కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ అన్నారు.పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సలను పురస్కరించుకుని సోమవారం ఫలక్‌నుమాలోని బషీర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో సాయి కిరణ్ రక్తదానం చేశారు.ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల మరో ప్రాణాన్ని రక్షించిన వారమవుతామని తెలిపారు.బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ అంబేద్కర్ రక్త దానం చేసిన కిషన్‌నబాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్‌కు సర్టిఫికెట్ ప్రధానం చేశారు.

## కూకట్‌పల్లి ఏవిబిపురం సంక్షేమ సంఘం ఎన్నికలు



సంక్షేమ సంఘం నాయకులను సన్మానించిన బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 27, ప్రభాతవార్త :**

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్ ఏవిబి పురం సంక్షేమ సంఘానికి జరిగిన ఎన్నికలలో అధ్యక్షులుగా పెద్దింటి సింహాద్రి, ప్రధాన కార్యదర్శిగా కలమట వెంకట్రావు విజయం పొందారు. ఈ సందర్భంగా వారు టీపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్‌ని కలువగా ఏవిబి పురం వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో గెలుపొందిన వారిని అభినందిస్తూ వారిని బండి రమేష్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి నాగిరెడ్డి, మేకల రమేష్, లక్ష్మయ్య, గోవింద్, ఏవీబీపురం వాసులు ఫల్గుణరావు, చంద్రరావు, లక్ష్మణరావు, పి వెంకట్రావు, ఎస్ వెంకట్రావు, ఎల్లారకేష్, కే రాము, టి ప్రసాద్, ఎస్ జయ రావు, పి పాపారావు, ఆర్ కుమార్, యు రమణ పాల్గొన్నారు.

## శెట్టిబలిజ కార్తీక మాస వనసమారాధనలో సతీష్ రావు



సతీష్ రావును సన్మానించిన సంఘం సభ్యులు

**కూకట్‌పల్లి, అక్టోబర్ 27, ప్రభాతవార్త :**

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ దత్తాత్రేయ కాలనీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం వారు నిర్వహించిన శెట్టిబలిజ కార్మిక మాస వనసమారాధన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి రామకృష్ణ, మట్టపర్తి బాలరాజు, సోమశేఖర్, మట్టపర్తి మూర్తి, కొప్పిశెట్టి పేరుశెట్టి, పాండు, సురేష్, సతీష్, రమణ, నాగు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నగర్‌లో ఘనంగా గార్వి ఉత్సవాలు...



గార్వి ఉత్సవాల్లో పాల్గొన్న సతీష్‌రావు

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 27, ప్రభాతవార్త :**

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎన్టీఆర్ నగర్ చాలీస్ మఖాన్ వద్ద గార్వి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఫజల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గార్వి ఉత్సవాల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు గార్వి ఉత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## విహారయాత్రలకు నప్రత్యేక బస్సులు : డిఎం శ్రీధర్

**కంటోన్మెంట్,అక్టోబర్ 27 ప్రభాతవార్త:** కార్తీక మాసంను పురస్కరించుకొని వివిధ యాత్రలకు వెళ్లే భక్తులకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ బస్ సౌకర్యాలు కల్పిస్తున్నామని రాణిగంజ్ డిపో మేనేజర్ ఏ. శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్రీశైలం,శిఖరం,పాలదార, పంచదార, అచ్చంపేటలోని ఉమా మహేశ్వర ఆలయం, కాళేశ్వరం, రామప్ప, వరంగల్ భద్రకాళి టెంపుల్, అరుణాచలం, కానిపాకం, గోల్డెన్ టెంపుల్ వంటి వివిధ పుణ్య క్షేత్రాలకు వళ్లేందుకు భక్తుల సౌకర్యార్థం టూర్ ప్యాకేజీ ద్వారా యాత్రలకు బస్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు 9959226147, 8096181859, 9394061089 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

## నవంబర్ 19 నుంచి బంజార భారత్ స్వర్ణోత్సవాలు : రవీంద్రనాయక్



సమావేశంలో ప్రసంగిస్తున్న బంజార భారత్ వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ రవీంద్రనాయక్

**ముషీరాబాద్, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** వచ్చేనెల 19 నుంచి 25వ తేదీ వరకు న్యూఢిల్లీలో బంజార భారత్ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామని బంజార భారత్, అఖిల భరతీయ బంజార మహాసేవా సంఘ్ వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ రవీంద్రనాయక్ తెలిపారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంజారాలు 18వ శతాబ్దం వరకు ఆశియా ఖండంలోని ప్రజలకు రక్షణ కల్పించేందుకు తమ ప్రాణాలను సైతం కోల్పోయారని, హిందూ సమాజాన్ని కాపాడిన ఘనమైన చరిత్ర బంజారాలదేనని స్పష్టం చేశారు. అటువంటి బంజారాలు దేశవ్యాప్తంగా 14 కోట్ల జనాభా ఉన్నారని, బంజారా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు చూసి, ఆనాటి ప్రధాన ఇందిరాగాంధీ రిజర్వేషన్లు కల్పించారని, అప్పటి నుంచి అనేక మంది బంజారాలకు రాజకీయంగా అనేక పదవులను అధిరోహించే అవకాశం వచ్చిందని గుర్తుచేశారు. ఈరోజు కొన్ని దుష్టశక్తులు బంజారాను కాంగ్రెస్ కు దూరం చేసే కుట్రలు చేస్తున్నారని, అందులో భాగంగా బంజారాలను దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వారి కుట్రలను తిప్పి కొట్టేందుకే ఢిల్లీలో బంజారా భారత్ స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ స్వర్ణోత్సవాలలో బంజార మాత ఇందిరాగాంధీకి పుష్పమాలార్పణ, తెలంగాణ రాష్ట్రం ఇచ్చి, బంజార గిరిజనులకు 6శాతం నుంచి 10 శాతంకు రిజర్వేషన్లు పెరిగేందుకు అవకాశం ఇచ్చిన సోనియమ్మకు పాలాభిషేకం చేస్తూ, బంజార సమాజం ఎల్లప్పుడు వారికి ఋణపడి ఉంటుందని తెలియచేస్తామని అన్నారు. ఈ బంజార భారత్ స్వర్ణోత్సవాలకు దేశవ్యాప్తంగా ఉన్న బంజార గిరిజన సోదరులంతా హాజరయి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిల భారతీయ బంజార మహాసేవ సంఘ్ నాయకులు జి.రవినాయక్ రాథోడ్, ఎస్.పి.నాయక్, రమావత్ భోనానాయక్, హనుమానాయక్, నవీన్‌నాయక్, జ్యోతి, హేమ, సురేఖాభాయ్, మౌనికభాయ్‌పాల్గొన్నారు.

## బిహెచ్‌ఈఎల్‌లో ఘనంగా కాపు వనభోజన మహోత్సవం



కాపు వనభోజన ఉత్సవాల్లో పాల్గొని ప్రసంగిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 27 ప్రభాతవార్త**

సమాజంలో ప్రతి వ్యక్తి తోటి వ్యక్తులపట్ల మానవవాదం, సామాజిక బాధ్యతతో మెలగాల్సిన అవసరం ఉందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. బిహెచ్‌ఈఎల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సేవాసమితి అధ్యక్షులు అరవా రామకృష్ణ ఆధ్వర్యంలో 59వ కాపు కార్తీక మాస వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, ఆర్‌సీపురం, అమీన్‌పూర్‌లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల కాపు సామాజిక వర్గానికి చెందిన వేలాది మంది ఒకేచోట చేరి కార్తీక వనమహోత్సవాన్ని వేడుకగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు,విజయవాడ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు, మాజీ మంత్రి, ఏపీ కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు,మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఏపి నాటక అకాడమి ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆకుల లలిత తదితరులు హాజరై ప్రసంగించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ..కార్తీక మాసం ఆధ్యాత్మికత,ఆనందాల మేళవింపులతో బంధువర్గాలల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. ప్రకృతితో మమేకం చేసి సామాజిక బంధాన్ని ఇనుమడింపచేస్తుందని ఆయన అన్నారు. సమాజంలో ప్రతి వ్యక్తి తోటి వ్యక్తికి సహకరించాలన్నారు. తెలంగాణలో హైడ్రా ద్వారా ప్రభుత్వ స్థలాలను కబ్జాచెరలోనికి చేరకుండా కాపాడుతున్నామన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎదిగిన ప్రతి ఒక్కరూ మరోకరిని చేయూతనందించినపుడు సమాజం శ్రేయోదాయకమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి నిర్వాహకులు, కాపు సంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇతర ప్రాంతాల నాయకులు, పెద్దసంఖ్యలో కాపు సామాజిక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల భర్తీతో నాణ్యమైన విద్య : కావలి గణేష్



కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కావలి గణేష్

**దుండిగల్, అక్టోబర్ 27, ప్రభాతవార్త**

ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉపాధ్యాయుల భర్తీతో నాణ్యమైన విద్యను అందించగలమని కావలి గణేష్ అన్నారు.మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగులూరు ప్రాథమిక పాఠశాలలో సిబ్బంది కొరత సమస్య కొనసాగుతోంది. ఈ అంశంపై పాఠశాల ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఉమ్మడి కుత్బుల్లాపూర్ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారికి వివరాలు తెలియజేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కావలి గణేష్ మాటాడుతూ పాఠశాలలో తగిన సిబందిని నియమించి విద్యార్థుల చదువుకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్, దొడ్డ కృష్ణ ముదిరాజ్, చినంగి శ్రీశైలం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు నిర్వాహించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి..



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

**దుండిగల్, అక్టోబర్ 27, ప్రభాతవార్త**

కొంపల్లి, దూలపల్లి, గుండ్లపోచంపల్లి, దుండిగల్, మేడ్చల్, తుంకుంట మునిసిపాలిటీల లో ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు లేకపోవడం వల్ల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఎన్నికలు జరిగితే వారికి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. వార్డుల విభజన, రిజర్వేషన్లు పూర్తి చేసి త్వరలో ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బైరి ఈశ్వర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యు. సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటీసీ అనిత, మాజీ కౌన్సిలర్ జె. దేవరాజ్, మాజీ వార్డ్ మెంబర్ యు.మహేష్, మాజీ వార్డ్ మెంబర్ బి.మదుసూదన్, సీనియర్ నాయకులు జెమ్మి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

**IN THE COURT OF THE HON'BLE IX ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD**

**O.S. NO. 492 OF 2025**

Between:

**Harsh Kapoor,** S/o. Omkar Prasad, Aged about 77 years, Occ: Retired R/o. 8-2-293/174/A27, Road No. 14, BN Reddy Colony, Banjara Hills, Hyderabad-500034 ...Plaintiff

AND

1. **The Tahsildar, Banjara Hills,** CCGP+FQJ, Road No. 02, Venkateshwara Nagar, Aurora Nagar Colony, Banjara Hills, Hyderabad, Telangana- 500034
2. **All Concerned** ...Defendants

This Notice is being issued by Order of the Hon'ble IX Addl Chief Judge, City Civil Court, Hyderabad, vide order dated 27.10.2025, that my Client, the above said Harsh Kapoor has filed a suit for declaration u/s 26 R/w Order VII Rule 1& 2 of CPC to declare himself as sole legal heir and successor of **Late Rajesh Kapoor** who deceased intestate on 05.12.2021 leaving behind Suit Schedule Property being 50% share of All that house property bearing Municipal No 8-2-293/174/A27 together with land admeasuring 405 Sq. Yds. situated at Road No. 14 Banjara Hills, Shaikpet Village, Hyderabad Dist. in ward No 8, Block No 2. Any person(s) having any objection/s, charge, claim, lien over the above said suit/properties of the deceased shall approach the under-signed office within 7 days from the day and date of publication with concerned documents or appear on 28.11.2025 at 10:30 am before the said Hon'ble IX Addl Chief Judge, City Civil Court, Hyderabad. No objection or claim will be entertained after the said period. Hence this Notice.

**(By Court Order)**

**M/s. Amera Pasha**

ADVOCATES

Office at G5, Pasha Court, 71 Greenlands Road, Somajiguda, Hyd-82

**Cell No:7729958828.**

**IN THE COURT OF THE HON'BLE III ADDL.JUNIOR CIVIL JUDGE-, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT :: KUSHAIGUDA**

**O.S.NO. 816 OF 2025**

BETWEEN:-

1) SMT. GHANTA KRISHNA KUMARI
2) NARLA VIKRAM RAJA
3) NARLA VENU ...Plaintiffs

AND

1) THE M.R.O., MALKAJGIRI MANDAL, MEDCHAL-MALKAJGIRI DISTRICT.
2) ALL CONCERNED ...Defendants

**NOTICE**

TO ALL CONCERNED...

Please take notice that, the above suit is filed by the plaintiffs to declare them, as the legal heirs of Late Sri.Narla Tata Rao, and the same is posted on **24/11/2025.** If any person/perosns having any objections/claims kindly appear either in person or through an advocate in the above said court at **10:30A.M.,** on the above said date. Otherwise the matter will be decided accordingly.

// BY ORDER OF THE HON'BLE COURT //

Sd/- **D.SAI PRASAD**

**ADVOCATE**

(ATS20250000480)

(TS/1231/2008)

H.No.1-8-28/16A, North Kamala Nagar, ECIL X Roads, (Post)-Hyderbad-500 062.

Mobile No.+91 9704092919

Date: 27/10/2025

Place: Kushaiguda

**IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL SENIOR CIVIL JUDGE: R.R.DISTRICT AT L.B.NAGAR**

**O.S.No. 256 OF 2025**

**Between:**

Smt. M. Vimala ...Plaintiff

AND

Sri. Deshagani Babu Goud & others ...Defendants

**To,**

D3) P. Ram Chandraiah, S/o. P. Ananthaiah, Aged about 60 years, R/o. H.No.23-4-718, Sultan Shahi, Hyderabad. ...Defendant No.3

Please take notice that the plaintiff had filed the above suit for declaration and perpetual injunction against you and others. The said suit is posted on 12-11-2025 for your appearance and reply, if any.

Therefore you are hereby directed to make it convenient to appear either in person or through duly instructed agent/pleader on 12-11-2025 at 10.30 A.M. before the Hon'ble Court, as otherwise, the Hon'ble Court will proceed with the matter in your absence.

**// BY ORDER OF THE COURT //**

**MATTAPALLY SRINIVAS**

**ADVOCATE**

H.No.2-3-930, Road No.2, Arunodaya Nagar Colony, Nagole, Hyderabad-500 068

**Mobile: 9848804811**

**Counsel for Plaintiff**

**IN THE COURT OF THE HON'BLE V SR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT HYD.**

**E.P.No. 131 OF 2013 in O.S.No. 2534 OF 2010**

**Between:-**

M/s.Margadarsi Chit Fund P Limited Lakdikapul Branch. ...Decree Holder

AND

Mr.Mohd Aslam & Others. ...Judgment Debtors

To

**JDR.No.6:-** Mrs. Shareefa Banu, W/o. M.A.Rasheed, R/o. H.No.22-4-352, Shaadilalki Galli, Alija Kotla, Hyderabad.

**TO WHOMSOEVER IT MAY BE CONCERN**

In the above mentioned E.P., the below mentioned immovable property is brought for Sale to realize the Decree Debt of Rs. 7,46,436/-. Auction is going to be held on 17.11.25 at Court premises at 10.30 A.M., Therefore, whoever is interested in purchasing the property can attend and participate in bid which is opened to one and all.

**SCHEDULE OF PROPERTY BELONGING TO JDR No.6 VIDE REGISTERED SALE DEED DOC.NO.497/1997. DT: 01.01.1997. S.R.O.: CHARMINAR.**

All that Double storied portion of House bearing Municipal No.22-4-352 admesuring 190 Sq. Yds equivalent to 158.86 Sq.Mtrs Situated at Kooche Shadi Lal inside Kotle Alijah, Hyderabad which is bounded as follows:- North : Neighbour's and Seri. South : Neighbour's. East Dharmavanth College. West : Common Passage and Portion of H.No.22-4-352. The terms and conditions of the sale may be ascertained from the Bailiff of the said Court.

**((BY ORDER OF THE COURT))**

**R.CHAKRADHAR**

ADVOCATE

H.No.6-1-295/1 PADMARAO NAGAR, HYDERABAD.

## విజయవంతంగా మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఏసిపి సుబ్బరామిరెడ్డి, చిత్రంలో ఇన్ స్పెక్టర్లు బ్రహ్మ మురారి, పిడమర్తి నరేష్, ఎస్ఐ సంజీవరెడ్డి తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 27, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సౌత్ ఈస్ట్ జోన్ మలక్ పేట ,సైదాబాద్ ఏసిపి విభాగాల ఆధ్వర్యంలో సైదాబాద్ ఎలైట్ కన్వెన్షన్ హాల్లో మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరంలో ఇన్ స్పెక్టర్లు, ఎస్ ఐ లు, పోలీసు అధికారులు, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, తదితరులు స్వచ్ఛందంగా విచ్చేసి రక్తదానం చేశారు. మెగా రక్తదాన శిబిరాన్ని మలక్ పేట ఏసిపి కే. సుబ్బ రామిరెడ్డి, సైదాబాద్ ఏసిపి వెంకట్ రెడ్డిలు పర్యవేక్షించగా సౌత్ ఈస్ట్ జోన్ అదనపు డిసిపి కె. శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడంతో విలువైన ప్రాణాలను కాపాడినవారమ వుతామని పేర్కొన్నారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు శాంతి భద్రతలను పరిరక్షించడమే పోలీసుల కర్తవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ స్పెక్టర్లు బ్రహ్మ మురారి, పిడమర్తి నరేష్, చంద్ర మోహన్, నాను నాయక్, కార్పొరేటర్లు కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి, బొక్క భాగ్యలక్ష్మి ఎస్సైలు సంజీవరెడ్డి, సురేష్ రెడ్డి, నాయకులు కొత్త కాపు రవీందర్ రెడ్డి, బొక్క మధుసూదన్ రెడ్డి, కొప్పుల దినేష్ పాల్గొన్నారు.

## శాంతి భద్రతలను కాపాడడమే పోలీసుల కర్తవ్యం
## : ఎసిపి సుబ్బరామిరెడ్డి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎసిపి సుబ్బరామిరెడ్డి, చిత్రంలో ఇన్ స్పెక్టర్లు పిడమర్తి నరేష్, బ్రహ్మ మురారి, నాను నాయక్ తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 27, ప్రభాతవార్త:** శాంతి భద్రతలను కాపాడడమే పోలీసుల కర్తవ్యమని మలక్ పేట ఏసిపి సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మలక్ పేట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పిడమర్తి నరేష్ ఆధ్వర్యంలో పోలీసులకు మద్దతుగా నిర్వహించిన వాక్ ఫర్ పోలీస్ కార్యక్రమానికి ఏసీపి సుబ్బరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ స్పెక్టర్లు పిడమర్తి నరేష్ , బ్రహ్మ మురారి, నాను నాయక్, ఎస్ఐలు సంజీవరెడ్డి, తేజ నాయక్, రాజశేఖర్ రెడ్డి , కళాశాల నిర్వహకులు పగడాల రమణ, విద్యార్థులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాసర సరస్వతి సన్నిధిలో మాసోత్సవం



**నేరేడ్ మెట్, అక్టోబర్ 27 (ప్రభాతవార్త):** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం సమీపంలోని శివ యోగి నిర్మల అంబయ్య సిద్ధాశ్రమంలో మాసోత్సవం ఘనంగా జరిగింది. దీపారాధన, కలశస్థాపన, మహారుద్రాభిషేకం, హోమాలు, భూదాన సంకల్పపూజ, అన్నదానం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ మాడుగుల రాజశేఖర శర్మ (శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ ప్రధాన అర్చకులు), శ్రీ శారద రాజేశ్వర్ (కోటి పార్థివలింగ స్తూప మందిర సలహాదారు)లకు "ఉత్తమ ఆధ్యాత్మిక సేవా పురస్కారం"ను ఆశ్రమ వ్యవస్థాపకులు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ దంపతులు ప్రదానం చేశారు. మాసోత్సవ విజయానికి సహకరించిన ధూప దీప నైవేద్య కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ప్రతి నెల మూడవ ఆదివారం ఉత్సవాలు, ఉచిత సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో నిత్య అన్నదానం



అన్న ప్రసాద వితరణ చెస్తున్న అడిషనల్ డి.సి.పి. కోటేశ్వరరావు, సతీష్ గౌడ్.

**వనస్థలిపురం. అక్టోబర్.27.ప్రభాతవార్త.** శ్రీ మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో ముద్ద గౌని సతీష్ కుమార్ గౌడ్ శివ గురు స్వామి ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమం 41 రోజులు ఈరోజు కార్తీక సోమవారం సందర్భంగా ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు సార్ గారు అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని సుమారు 1000 మంది శివ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది

## మైనంపల్లి హనుమంతరావు కృషితోనే కౌకూర్ అభివృద్ధి



**నేరేడ్మెట్, అక్టోబర్ 27,ప్రభాతవార్త:** కౌకూర్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముందుండి కృషి చేస్తున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ప్రశాంత్ విహార్ కాలనీలో రూ.40 లక్షలతో, ప్రియదర్శిని ఎంక్లేవ్‌లో రూ.41.8 లక్షల వ్యయంతో సి.సి. రోడ్ల పనులను 133వ డివిజన్ కార్పొరేటర్ జితేందర్నాథ్ ప్రారంభించారు. ఆరు నెలల క్రితం ప్రశాంత్ విహార్ వాసులు రోడ్ల సమస్యలపై సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తుడిమెళ్ల మల్లికార్జున్‌ను కలిసి తమ ఇబ్బందులు వివరించగా, ఆయన దానిని మైనంపల్లి హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన హనుమంతరావు జోనల్ కమిషనర్‌తో చర్చించి పనులకు ఆమోదం తీసుకువచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని హనుమంతరావు, మల్లికార్జున్ లకు కృతజ్ఞతలు తెలిపారు. రైన్ స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం కూడా అత్యవసరమని మల్లికార్జున్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు భారీగా హాజరయ్యారు.

## విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి : చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న నోబుల్ విద్యాసంస్థల చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి తదితరులు

**మలక్ పేట, అక్టోబర్ 27, ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని నోబుల్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్. రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు ముసారాంబాగ్ లోని నోబుల్ డిగ్రీ పీజీ కళాశాలల 202225 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను కన్నుల పండువగా నిర్వహించగా, తదుపరి విబ్రాంత్ ప్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా నోబుల్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్. రాజేశ్వర్ రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు ఆయన గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధనను అందిస్తున్నామని అన్నారు. కళాశాలలో విద్యార్థుల కోసం అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ల్యాబ్ తో పాటు లైబ్రరీ కూడా ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు. విద్యా బోధన తో పాటు నైతిక విలువలను కూడా పెంపొందిస్తున్నామని, విద్యార్థులు క్రమశిక్షణను పాటిస్తూ తరగతులకు తప్పనిసరిగా హాజరవ్వాలని ఆయన సూచించారు. ఎంచుకున్న అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని మంచి ఉద్యోగాలను పొందాలని అన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్ ను , సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. ఆలోచనలను కార్యరూపంలో అమలుపరచాలని, కష్టపడే తత్వం ఉన్నవారు తప్పక ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. అత్యుత్తమ అధ్యాపక బృందంతో ఆధునాతన పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నామని వివరించారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతనంగా తీర్చడానికి పునాది వేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం ఆసక్తి ఉన్న రంగాలను ఎంచు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విటల్, కళాశాల ఇంచార్జ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టిపి ప్లాంట్ పనులు నిలిపివేయాలని స్థానికుల ధర్నా

**మద్దతు పలికిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, తీన్మార్ మల్లన్న**



ఉప్పల్ ఎస్‌టిపి ప్లాంటు బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 27 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని కురుమనగర్‌లో నిర్మిస్తున్న ఎస్‌టిపి ప్లాంట్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని స్థానికులు సోమవారం ఆందోళన నిర్వహించారు. జనావాసాల మధ్య ఎస్‌టిపి ప్లాంటు ఏర్పాటు చేయడం వల్ల స్థానికులు ఇబ్బందులు పడతారని, ప్లాంటు నిర్మాణం చేయవద్దని ఆందోళన చేపట్టారు. వీరికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మద్దతు పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్న సివరేజీ ట్రీట్ మెంట్ ప్లాంట్ పనులను వెంటనే నిలిపివేయాలని, సుమారు ఐదు వేల మంది నివసించే కాలనీవాసుల మధ్య ప్లాంటు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ప్లాంటు పనులు నిలిపివేయకపోతే జలమండలి, జీహెచ్ఎంసి కార్యాలయం ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. అత్యధికశాతం మంది నిరుపేదలు నివసించే ఈ ప్రాంతంలో ప్లాంటు ఏర్పాటు చేయడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం స్థానికుల నుంచి ఎటువంటి సమాచారం లేకుండా ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారని, ప్లాంటు ఏర్పాటు చేస్తే దుర్వాసనలతో ఇబ్బందులు పడుతారని వారు పేర్కొన్నారు. దీనిపై ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికులను సముదాయించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, మహంకాళి లక్ష్మన్, స్థానిక కాలనీ సంఘం నేతలు శ్రీశైలం, అబ్బయ్య, సధాకర్, నరసింహ, శోభ తదితరులు పాల్గొన్నారు.

## నేర్చుకున్న విద్యను ప్రదర్శించినప్పుడే సార్థకత చేకూరుతుంది



నేర్చుకున్న విద్యను ప్రదర్శిస్తున్న నారాయణ విద్యార్థిని: పక్కన పరిశీలిస్తున్న జిఎం, ఎజిఎం, ప్రిన్సిపాల్ తదితరులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** నేర్చుకున్న విద్యను ప్రదర్శించినప్పుడే దానికి సార్థకత చేకూరుతుందని నారాయణ జిఎం గోపాల్‌రెడ్డి, ఎజిఎం రవీంద్రబాబు అన్నారు. మీర్‌పేట్‌లోని నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో సోమవారం విద్యార్థి నేతృత్వ సమావేశం (స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్) నిర్వహించారు. ఈ సందర్భంగా టర్మ్-1 కాలంలో పాఠశాలలో బోధించిన విద్యకు సంబంధించి నేర్చుకున్న పలు అంశాలను, ప్రాజెక్టలను విద్యార్థులు విపులంగా వివరించారు. ఈ-ఛాంప్స్ విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని పలు అంశాలను చక్కగా వివరించారు. అయితే స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్‌కు హాజరైన జిఎం, ఎజిఎంలు తరగతి గదులను సందర్శించి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నారాయణ విద్యార్థుల గ్రాహక శక్తి భేషుగ్గా ఉందని ప్రశంసించారు. బోధించిన అంశాలను, ప్రాజెక్టలను విద్యార్థులు గుర్తుంచుకునే విధంగా వారిని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జి, ఈ-ఛాంప్స్ ఆర్అండ్‌డి మహేశ్వరి, కో-ఆర్డినేటర్ దివ్య, విపిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీసు అమర వీరులను గుర్తు చేసుకోవాలి
## : మహేశ్వరం ఎసిపి జానకీరెడ్డి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మహేశ్వరం ఎసిపి జానకీరెడ్డి: పక్కన బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్ తదితరులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవాలని మహేశ్వరం ఎసిపి జానకీరెడ్డి పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ నుండి మల్లాపూర్ వరకు చేపట్టిన బైక్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ దేశ రక్షణలో, సమాజంలో శాంతిభద్రతలను కాపాడడంలో టెర్రరిస్టులు, నక్సలైట్లు, సంఘ విద్రోహక శక్తుల చేతుల్లో ఎంతో మంది పోలీసులు అమరులయ్యారని అన్నారు. అయితే వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని, వారోత్సవాలను నిర్వహించుకోవడం జరుగుతున్నదని వెల్లడించారు. ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలను అందరూ గుర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్, కోటేశ్వర్‌రావు, సోహైల్, నవీన్, ప్రసాద్, ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, సిబ్బంది, పలువురు యువకులు పాల్గొన్నారు.





పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన బొక్క మధుసూదన్ రెడ్డికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న సౌత్ ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ శ్రీకాంత్, చిత్రంలో ఏసీపీలు సుబ్బరామిరెడ్డి, వెంకటరెడ్డి, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి నాయకులు కొప్పుల దినేష్ తదితరులు (మలక్ పేట , ప్రభాతవార్త)

## ప్రజల అవసరాలపై పోలీసుల ప్రత్యేక కార్యక్రమం



**నేరేడ్‌మెట్, అక్టోబర్ 27,ప్రభాతవార్త :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నేరేడ్‌మెట్ పోలీసులు ప్రజల అవసరాలను తెలుసుకునే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సోమవారం భగత్‌సింగ్ కాలనీలో స్థానికులతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ కాలనీ అధ్యక్షుడు, ఎమ్మార్పీఎఫ్ నాయకుడు రామచందర్ పాల్గొన్నారు. కాలనీవాసులు తమ అవసరాలు, సమస్యలను పోలీసులకు వివరించారు. నేరేడ్‌మెట్ ఇన్స్పెక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ "ప్రజలకు చేరువ కావడం, వారి అవసరాలను ప్రత్యక్షంగా వినడం పోలీసు శాఖ ప్రధాన ధ్యేయం. భగత్‌సింగ్ కాలనీవాసులు తెలిపిన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తాం. పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థం ఇలాంటి కార్యక్రమాలనుమరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నేరేడ్‌మెట్ పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

## జలమండలి ఎండితో మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి బేటి



జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 27 ప్రభాతవార్త :** జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సోమవారం బేటి అయ్యారు. బిజెపి ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు మార్నెని ఫణీందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఉప్పల్ డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను జలమండలి ఎండికి దృష్టికి తీసుకుని వచ్చారు. ఉప్పల్ డివిజన్ సూర్యనగర్‌లో మిషన్ భగీరధ లైన్ పొడిగించాలని, కురుమనగర్‌లో యుజిడి లైన్లు నిర్మించాలని కోరారు. ఉప్పల్ సరస్వతి కాలనీ, రాజ్‌నగర్ కాలనీలో కలుషిత నీరు సరఫరా అవుతుందని, రాజ్యలక్ష్మి దియేటర్ సమీపంలో ఉన్న ఇళ్లలో మురుగునీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై జలమండలి ఎండి అశోక్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ బిజెపి డివిజన్ అధ్యక్షులు మార్నెని ఫణీంద్ర, ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో పోలీసు అమర వీరుల సంస్మరణ ర్యాలీ



మీర్‌పేట్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్స్‌పెక్టర్ శంకర్ కుమార్ నాయక్: చిత్రంలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా కానిస్టేబుళ్ళు, విద్యార్థులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** మీర్‌పేట్‌లో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ ర్యాలీని నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, పౌరుల ధన, మాన, ప్రాణాలను కాపాడడంలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం, వారోత్సవాల సందర్భంగా ఇన్స్‌పెక్టర్ శంకర్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో మీర్‌పేట్ చౌరస్తా నుండి ప్రశాంతినగర్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు, వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీలో పోలీసు అమర వీరులను స్మరించుకుంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.

## ముంపుకాలనీల శాశ్వత పరిష్కారం కోసం భారీ స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మించాలి : లచ్చిరెడ్డి



కో.ఆర్డినేషన్ మీటింగ్‌లో జలమండలి అధికారులతో కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. అక్టోబర్.27.ప్రభాతవార్త :** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్లోని ముంపు కాలనీలకు శాశ్వత పరిష్కారం చేయాలని బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సోమవారం బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని జలమండలి కార్యాలయంలో జలమండలి మరియు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కురిసిన భారీ వర్షాలతో వినూత్న కాలనీ,గాంధీ నగర్ సౌత్, అఖిలాండేశ్వరి కాలనీ, స్నేహమయి నగర్ కాలనీ,పివిఆర్ కాలనీ తదితర పరిసర కాలనీలో ముంపుకు గురవుతున్నాయని వాటికి శాశ్వత పరిష్కారం కోసం స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మించుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని జిహెచ్ఎంసి మరియు జలమండలి అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కారం చేయాలని మరియు ఉన్నత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సమస్య శాశ్వత పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సంబంధిత అధికారులతో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి జిఎం బలరాం రాజు, ఇంజనీరింగ్ విభాగం డి ఈ దామోదర్ రావు, జలమండలి డీజీఎం రాజగోపాల్, ఇంజనీరింగ్ ఏఈ కార్తీక్, జలమండలి మేనేజర్ సత్యానారాయణ, సిరివెన్నెల,మరియు తదితరులు ఉన్నారు.

## ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం
## : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**నేరెడ్ మెట్, అక్టోబర్ 27,ప్రభాతవార్త :** ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆటో మీటర్ రేట్లు, పెరిగిన పెట్రోల్ ధరలు, పోలీసుల వేధింపులు, ఆదాయం తగ్గిపోవడం వంటి సమస్యలను ఆటో కార్మికులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"ప్రజల సమస్యల పరిష్కారమే మా ధ్యేయం. ఆటో కార్మికుల కష్టాలకు త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తాం" అని హామీ ఇచ్చారు.

## నేరాల నివారణకు అవగాహన పెంపొందించుకోవాలి



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణయ్య, మక్బూల్ జానీ

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** నేరాలు జరగకుండా ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ఎల్బీనగర్ ఎసిపి కృష్ణయ్య పేర్కొన్నారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాచకొండ కమీషనర్ ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నాగోల్ చౌరస్తా వద్ద ఏసీబీ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు, సైబర్ నేరాలు, సీసీటీవీల ఉపయోగాలు, డ్రగ్స్ నివారణ, మహిళలు, వృద్దులు, పిల్లలపై జరిగే నేరాలు, సమాజం పట్ల పౌరుల భాద్యతల వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మక్బూల్ జానీ, ఎస్సై ఉమ, ఏఎస్ఐలు జంగయ్య, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## అధికంగా వస్తున్న మంచినీటి బిల్లులు తగ్గించాలి



జలమండలి జిఏంతో మాట్లాడుతున్న పవన్ కుమార్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త:** పలు కాలనీలలో అధికంగా వస్తున్న మంచినీటి బిల్లులను తగ్గించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకుడి పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జలమండలి జీఎం బాలరాంని సోమవారం కార్పొరేటర్ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జనప్రియ క్వార్టర్స్‌లో అధిక నీటి బిల్లులు జారీ కావడంతో స్థానిక నివాసితులు, అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ దృష్టిని సమస్యను తీసుకువెళ్లారు. దీంతో జీఎం బాలరాంకి సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా శ్రీశంకర్ కాలనీ, భరత్ నగర్, అంబేద్కర్ నగర్, మారుతీ నగర్ కాలనీలలో మంజూరి అయిన డ్రైనేజ్ పనులను త్వరగా మొదలుపెట్టి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రవీందర్ వర్మ, స్రవంతి రెడ్డి, బిజెపి నాయకులు అశ్విన్, జనప్రియ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## సౌత్ ఈస్ట్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాతలకు సర్టిఫికేట్లు అందజేస్తున్న అడిషనల్ డిసిపి కె.శ్రీకాంత్

**సైదాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సౌత్ ఈస్ట్ జోన్ పరిధిలోని మలక్‌పేట, సైదాబాద్ ఎసిపిల ఆధ్వర్యంలో సైదాబాద్ లోని ఎలైట్ కన్వెన్షన్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సైదాబాద్ ఎసిపి పరిధిలోని మాదన్నపేట, సైదాబాద్, మలక్‌పేట ఎసిపి పరిధిలోని మలక్‌పేట, ఛాదర్‌ఘాట్, డబీర్‌పుర పోలీస్ స్టేషన్ల సిబ్బందితో పాటు స్థానికులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా తరలివచ్చి రక్తదానం చేశారు. సైదాబాద్ ఎసిపి ఎస్.వెంకట్‌రెడ్డి, మలక్‌పేట ఎసిపి కె.సుబ్బరామి రెడ్డిల పర్యవేక్షణలో జరిగిన ఈ రక్తదాన శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా సౌత్ ఈస్ట్ జోన్ అడిషనల్ డిసిపి కె.శ్రీకాంత్, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డిలు హాజరయ్యారు. రక్తదాతలకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ బి.చంద్రమోహన్, మాదన్నపేట ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పి. నరేష్, ఛాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ కె.బ్రహ్మ మురారి, డబీర్‌పుర ఇన్‌స్పెక్టర్ డి.నాను నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు : కార్పొరేటర్



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 27 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ఓల్డ్ లింగోజిగూడ గ్రామంలో రూ. 35లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ధ్వంసమైన రోడ్లకు మరమ్మత్తులు చేపడుతున్నామని, అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. డివిజన్‌లో కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, శ్రీధర్, రాంబాబు, జైపాల్, ప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈస్ట్‌జోన్ పోలీసులు రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న వారితో పోలీస్ అధికారులు

**తార్నాక, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** పోలీసు అమర వీరుల సంస్మరణ సందర్భంగా ఈస్ట్‌జోన్ పరిధిలోని చిలుకలగూడ, ఓ.యూ డివిజన్ల ఆధ్వర్యంలో సోమవారం ఓ.యూలోని నాన్‌టీచింగ్ హోంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిభిరానికి విశేష స్పందన వచ్చింది. పలువురు ఎస్సైలు, పీస్‌కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొని రక్తదాన చేశారు. ఈ రక్తధాన శిభిరాన్ని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య ఓ.యూ ఏసీపీ జి.గజన్, చిలుకలగూడ ఏసీపీ కె.శశాంక్ లు పాల్గొని బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ నర్సయ్య మాట్లాడుతూ డీజీపీ, నగర సీపీల ఆదేశాల మేరకు తాము రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రక్తదానమే ప్రాణదానం అన్నారు. పోలీసులు విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరుల త్యాగాలకు నివాళిగా మెగా రక్తదాన శిభిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సేకరించిన బ్లడ్‌ను తలసేమియా వ్యాది రోగులకు సహాయం చేసేందుకు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్లు అప్పలనాయుడు, అనుదీప్, ఎ.మధుసూధన్ రెడ్డి, కె.మారుతిపాల్గొన్నారు

## చిన్న చెరువు వద్ద చట్ పూజకు ఏర్పాట్లు



రామంతాపూర్ చిన్న చెరువులో చట్ పూజ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, అక్టోబరు 27 ప్రభాతవార్త :** బీహార్ ప్రాంత వాసులు ఎంతో పవిత్రంగా చేసుకునే చట్ పూజకు రామంతాపూర్ చిన్న చెరువు వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ అధికారులతో కలిసి ఆమె చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామంతాపూర్ పరిసర ప్రాంతాల్లో ఉండే బీహార్ వాసులు ప్రతీ ఏటా భక్తి శ్రద్ధలతో చట్ పూజ నిర్వహిస్తారని తెలిపారు. ఈ పూజ ప్రధానంగా సూర్య భగవానుడి ఆరాధనకు సంబంధించినదని, రెండు రోజులపాటు వేడుకలు చేసుకుంటారని తెలిపారు. మహిళలు దీక్ష తీసుకుని ఉపవాసం పాటిస్తారని, పూజలో భాగంగా అరటి, కొబ్బరి, చెరకు, పండ్లు, తీపి పదార్థాలతో సూర్యుడికి నైవేద్యం సమర్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ మౌనిక, వర్క్ ఇన్స్పెక్టర్ మహేందర్, అసోసియేషన్ నేతలు సురేష్ సింగ్, భగవాన్ సింగ్, కమలేష్, ఉదయ్ శర్మ, సందీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి



శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు

**తార్నాక, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** కార్తిక మాసం తొలి సోమవారం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి దంపతులు సోమవారం శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయాన్ని దర్శించుకుకొని ప్రత్యేక పూజలు చేశారు. శివుడి ఆశిష్యులతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు వారు చెప్పారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



ఇందిరమ్మ ఇంటి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

**హయత్ నగర్, అక్టోబర్ 27 ప్రభాతవార్త :** ప్రజాపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటు న్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గండి చెరువు, లష్కర్ గూడ, అనాజ్ పూర్, మజీద్ పూర్, ఇనాంగూడ, పిగ్లీపూర్, బండరావిరాల గ్రామాలలో అదనంగా మంజూరైన 36 మంది లబ్దిదారులకు ఆయన సోమ వారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అండగా ఉంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సిహెచ్ భాస్కర్ చారి, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ గౌడ్, మాజీ సర్పంచ్ లు జక్క సంజీవరెడ్డి, కావాడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు